


PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267

తెలుగు దినపత్రిక

సంపుటి: 6 సంచిక: 06, పేజీలు - 08

మంగళవారం, జూన్ 30, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD




## ప్రభుత్వ ఉద్యోగుల జీతంలో 1.5 శాతం కట్

**- మే నెల వేతనం నుంచే అమలు**




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులు , పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులకు మరింత సమర్థవంతంగా ఆరోగ్య సేవలను అందించేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం కీలక నిర్ణయానికి శ్రీకారం చుట్టింది. ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్(ఈహెచ్ఎస్) నిర్వహణ కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఎంప్లాయిస్ హెల్త్ కేర్ ట్రస్ట్ (ఈహెచ్‌సీటీ) నిధికి ప్రతి ఉద్యోగి, పెన్షనర్ నుంచి మూల వేతనం లేదా మూల పింఛనులో 1.5 శాతం చందాగా మినహాయించాలని తెలంగాణ ఆర్థిక శాఖ నిర్ణయించింది. ఈ మేరకు

2లో..

## గ్రేటర్‌లో పాగా కోసం
# హోరా హోరీ

**- పోటా పోటీగా ప్రజల్లోకి కాంగ్రెస్ - బీఆర్ఎస్**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాజకీయాలు ఆసక్తి కరంగా మారుతున్నాయి. కాంగ్రెస్ – బీఆర్ఎస్ పోటా పోటీగా ప్రజల్లోకి వెళ్లే ప్రయత్నం చేస్తున్నాయి. రెండున్నారేళ్ల పాలన పూర్తయిన తరువాత రేవంత్ తన రూటు మార్చారు. వచ్చే ఎన్నికల కోసం మిగిలిన కాలాన్ని సద్వినియోగం చేసుకోవాలని డిసైడ్ అయ్యారు. ఇదే సమయంలో బీఆర్ఎస్ సైతం కొత్త వ్యూహాలు సిద్ధం చేస్తోంది. త్వరలో కేసీఆర్ బస్సు యాత్రకు సిద్ధం అవుతున్నారు. ఈ సమయంలో కేటీఆర్ తీసుకున్న నిర్ణయాలు ఆసక్తి కరంగా మారుతున్నాయి.సీఎం రేవంత్ కేటీఆర్ ఇప్పుడు ఇద్దరూ గ్రేటర్ ఎన్నికలే లక్ష్యంగా రంగంలోకి దిగారు. ఎస్ఐఆర్ పైనా ఫోకస్ చేసారు. పార్టీ నేతలకు దిశా నిర్దేశం చేస్తున్నారు. జూబ్లీహిల్స్ బై పోల్ తరువాత గ్రేటర్ పైన బీఆర్ఎస్ ఎలాగైనా పాగా వేయాలనే పట్టుదలతో ఉంది. అటు 2023 ఎన్నికల్లో ఒక్క సీటు పార్టీకి రాకున్నా బైపోల్స్ లో రెండు స్థానాలు గెలిచిన కాంగ్రెస్ గ్రేటర్ పరిధిలోని మూడు కార్పొరేషన్లు గెలుచుకోవాలని ప్రయత్నిస్తోంది. గ్రేటర్ కేంద్రంగా కేటీఆర్ కొత్త వ్యూహాలతో దూసుకుపోతున్నారు. గ్రేటర్ పరిధిలో విస్తృతంగా పర్యటిస్తూ, నియోజకవర్గాల వారీగా సమీక్షలు నిర్వహిస్తూ కేడర్‌లో కొత్త జోష్ నింపుతున్నారు. గ్రేటర్ పరిధిలోనే ఏకంగా 24 అసెంబ్లీ నియోజకవర్గాలు విస్తరించి ఉన్నాయి. దీనికి ఆనుకుని ఉన్న శివారు నియోజకవర్గాలను కూడా కలుపుకుంటే ఈ సంఖ్య దాదాపు 35 కి చేరుకుంటుంది. రాష్ట్రంలో అధికారం దక్కాలంటే ఈ ప్రాంతం ఈ సీట్లు చాలా కీలకం. దీంతో అటు సీఎం రేవంత్ – ఇటు కేటీఆర్ గ్రేటర్ లో పాగా వేయాలని భావిస్తున్నారు.2023 అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ గాలి వీచినా, హైదరాబాద్‌తో పాటు శివారు ప్రాంతాల్లో మాత్రం బీఆర్ఎస్ తిరుగులేని ఆధిక్యాన్ని ప్రదర్శించింది. అదే ఊపును రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లోనూ కొనసాగించి, ఇక్కడ అధికార కాంగ్రెస్ పార్టీని గనుక మట్టికరిపించగలిగితే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో విజయం నల్లేరుపై నడకే అని బీఆర్ఎస్ గట్టిగా భావిస్తోంది. ఇక్కడ సాధించే విజయం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వ పతనానికి గట్టి పునాది వేయవచ్చనేది కేటీఆర్ మాస్టర్ ప్లాన్‌గా కనిపిస్తోంది. ఇటు రేవంత్ సైతం గ్రేటర్ కేంద్రంగానే కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు. అటు కేటీఆర్ హైదరాబాద్‌లోని దాదాపు అన్ని నియోజకవర్గాలపై ప్రత్యేక

2లో..

## మూడు నెలల్లో ఎన్నికలు రావొచ్చు

**- డీఎంకే శ్రేణులకు స్టాలిన్ పిలుపు**



చెన్నై (ప్రశ్న న్యూస్) తమిళనాడులో రాజకీయ పరిణామాలు వేగంగా మారే అవకాశం ఉందని డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ అన్నారు. మరో ఐదేళ్లు ఎదురుచూడాల్సిన అవసరం లేదని, మూడు నెలలు లేదా ఆరు నెలల్లో ఎన్నికలు రావొచ్చని పార్టీ శ్రేణులను అప్రమత్తం చేశారు. ఇప్పటి నుంచే ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. చెన్నైలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో మాజీ మంత్రి బెంజమిన్‌తో పాటు పలువురు ఏఐఏడీఎంకే నేతలు, కార్యకర్తలు డీఎంకేలో చేరారు. ఈ సందర్భంగా స్టాలిన్ మాట్లాడారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న టీవీకే ప్రభుత్వానికి సొంతంగా మెజారిటీ లేదన్నారు. 118 సీట్ల మెజారిటీ అవసరం కాగా ఆ పార్టీకి 108 స్థానాలే వచ్చాయని గుర్తు చేశారు.
ప్రస్తుతం ప్రభుత్వం ఇతర పార్టీల మద్దతుతోనే కొనసాగుతోందన్నారు. ఇటీవల వరకు డీఎంకే కూటమిలో ఉన్న కాంగ్రెస్, వామపక్షాలు, వీసీకే, ఐయూఎంఎల్ మద్దతుతోనే ప్రభుత్వం నడుస్తోందని చెప్పారు. అలాంటి ప్రభుత్వం ఎంతకాలం కొనసాగుతుందో చెప్పలేమన్నారు. ఎప్పుడు కూలిపోతుందో తెలియదని వ్యాఖ్యానించారు. అందుకే పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇప్పటి నుంచే ఎన్నికలకు సిద్ధం కావాలని స్టాలిన్ సూచించారు. ఎన్నికల షెడ్యూల్ వచ్చిన తర్వాత కాకుండా, ఇప్పటి నుంచే క్షేత్రస్థాయిలో పని ప్రారంభించాలని

2లో..

## కొడంగల్‌లో
# కర్ణాటక ఓటర్లు

**- కొడంగల్‌లో 33 వేల డూప్లికేట్ ఓట్లు ఉన్నాయి - ఆ ఓట్లతోనే రేవంత్ గెలిచారా.?**

**- కవిత సంచలన ఆరోపణలు**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గమైన కొడంగల్ ఓటర్ల జాబితాపై సంచలన ఆరోపణలు చేశారు. బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కీలక ఆధారాలు వెల్లడించారు. కొడంగల్‌లో భారీ ఎత్తున డూప్లికేట్ ఓట్లు ఉన్నాయని, ఎన్నికల సంఘం ముఖ్యమంత్రికి ఏమైనా ఫేవర్ చేసిందా అనే అనుమానాలు కలుగుతున్నాయని మండిపడ్డారు. కొడంగల్ నియోజకవర్గంలో దాదాపు 22,433 డూప్లికేట్ ఓట్లు ఉన్నాయని, వీటికి తోడు పక్కనే ఉన్న కర్ణాటకలోని సెడం నియోజకవర్గానికి చెందిన 11 వేల మంది ఓటర్లు ఇక్కడ కూడా ఓటు హక్కు కలిగి ఉన్నారని ఆమె ఆధారాలతో సహా ఆరోపించారు.సరిహద్దు రాష్ట్రమైన కర్ణాటక నుంచి తెలంగాణకు కేవలం ఎన్నికల డబ్బులు మాత్రమే

2లో..

## ఢిల్లీలో అంతా ఈవీలే

**- ఢిల్లీ నగరంలో కాలుష్య నియంత్రణకు ప్రభుత్వం చర్యలు**

**- సంప్రదాయ ఇంధనంతో నడిచే వాహనాలపై పూర్తి నిషేధం**

**- ఈవీలు ప్రోత్సహించేందుకు సబ్సిడీలు, ట్యాక్స్ మినహాయింపు**



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** దేశ రాజధానిలో కాలుష్య నియంత్రణ చర్యలలో భాగంగా విద్యుత్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించే దిశగా ఢిల్లీ సర్కారు కీలక నిర్ణయం తీసుకుంది. ‘ ఢిల్లీ ఈవీ పాలసీ 2026 ’కు క్యాబినెట్ ఆమోదం తెలిపినట్టు ముఖ్యమంత్రి రేఖా గుప్తా సోమవారం వెల్లడించారు. జూలై 1 నుంచి అమల్లోకి వచ్చే ఈ విధానం 2030 మార్చి 31 వరకు కొనసాగుతుందని ఆమె తెలిపారు. కొత్త పాలసీ ద్వారా రాబోయే

2లో..

# ప్రభుత్వ సేవలు సులభతరం


## – ‘మనమిత్ర’ పేరుతో ఫిర్యాదుల స్వీకరణ

**- సెక్రటరీలు, హెచ్ఓడీలు, కలెక్టర్లు క్షేత్రస్థాయిలో తప్పనిసరిగా పర్యటించాలని సర్క్యులర్**

**- మూడు నెలల్లో రాష్ట్రంలోని 3,000 ప్రాంతాల్లో మొబైల్ నెట్‌వర్క్ సమస్యల పరిష్కారానికి డెడ్‌లైన్**

**- 'నవచేతన' కింద పిల్లల ఎదుగుదలపై రాష్ట్రవ్యాప్తంగా స్క్రీనింగ్ కార్యక్రమం**

అమరావతి (ప్రశ్న న్యూస్) ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు, పరిపాలనలో పారదర్శకత, వేగాన్ని పెంచేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ పథకాలు, సేవలు పొందడంలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగించి, ప్రక్రియలను సులభతరం చేయాలని ఆయన స్పష్టం చేశారు. నేడు అమరావతి సచివాలయంలోని రియల్-టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్టీజీఎస్) కేంద్రంలో వివిధ శాఖల పనితీరుపై ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలతో నిత్యం సంబంధాలుండే శాఖల్లో సేవల సరళీకరణపై ప్రధానంగా దృష్టి సారించారు.ముందుగా 11 రకాల కీలక సేవల్లో అనవసరమైన ప్రక్రియలను కుదించి, వాటిని సులభతరం చేస్తున్నామని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. దీనిపై సంతృప్తి వ్యక్తం చేసిన సీఎం, ప్రజా ఫిర్యాదుల స్వీకరణ వ్యవస్థను (పీజీఆర్ఎస్) మరింత పటిష్ఠం చేయాలని ఆదేశించారు. ప్రజలు తమ సమస్యలను సులభంగా ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చేలా ఆన్‌లైన్ పోర్టల్‌తో పాటు, ‘మనమిత్ర’ వాట్సాప్ ద్వారా ప్రత్యేక సేవలను ప్రారంభించాలని సూచించారు. కేవలం టెక్స్ట్ మెసేజ్‌లే కాకుండా, వాయిస్ మెసేజ్‌ల రూపంలో పంపే ఫిర్యాదులను కూడా స్వీకరించి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.



### క్షేత్రస్థాయికి అధికారులు.. కనెక్టివిటీకి డెడ్‌లైన్

ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని, తక్షణమే పరిష్కరించేందుకు

2లో..

## డబుల్ ఇంజిన్ సర్కార్‌తోనే తెలంగాణ అభివృద్ధి

**- యువతకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చలేదని విమర్శ**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ సమగ్రాభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని, ‘డబుల్ ఇంజిన్ సర్కార్’ వస్తేనే రాష్ట్ర భవిష్యత్తు మారుతుందని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో తెలంగాణలో బీజేపీ కచ్చితంగా అధికారంలోకి వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. నేడు ఘట్‌కేసర్ సమీపంలో జరిగిన ‘వికసిత్ భారత్ స్టూడెంట్ కాంక్లేవ్’ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా నితిన్ నబిన్ మాట్లాడుతూ “ప్రస్తుత యువతరం (జెన్ జడ్) దేశ వ్యతిరేక ఆలోచనలతో కాకుండా, దేశ నిర్మాణమే లక్ష్యంగా పనిచేస్తోంది. కొందరు క్రీడల్లో, మరికొందరు స్టార్టప్‌లతో తమ భవిష్యత్తును, దేశ భవిష్యత్తును నిర్మిస్తున్నారు. దేశంలో 2.25 లక్షల మంది యువత స్టార్టప్‌ల ద్వారా ఉద్యోగ సృష్టికర్తలుగా మారారు” అని

2లో..

# కష్టపడి చదవండి.. మీ కలలు నెరవేర్చే బాధ్యత నాది

## - విద్యారంగంలోకి ఏఐ ట్యూటర్‌ను తీసుకొస్తామన్న లోకేశ్

**- సమాజంలో మార్పు కోసం కొంతమంది విద్యార్థులైనా రాజకీయాల్లోకి రావాలని పిలుపు**

**- షైనింగ్ స్టార్స్ కార్యక్రమంలో విద్యార్థుల సమస్యలు విని తక్షణ సాయంపై హామీలు**

**- ప్రతి నియోజకవర్గంలో ఒక మోడల్ స్కూలు ఏర్పాటు చేయడమే లక్ష్యమని వెల్లడి**




**అమరావతి (ప్రశ్న న్యూస్)** “మీరు కష్టపడి చదవండి విద్యాశాఖ మంత్రిగా మీ కలలను సాకారం చేసేందుకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తాను” అని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ విద్యార్థులకు భరోసా ఇచ్చారు. సమాజంలో మార్పు కోసం యువత రాజకీయాల్లోకి రావాలని ఆయన పిలుపునిచ్చారు. మంగళగిరి నియోజకవర్గం తాడేపల్లిలోని సీఎస్ఆర్ కళ్యాణ మండపంలో నిర్వహించిన ‘షైనింగ్ స్టార్స్’ కార్యక్రమంలో లోకేశ్ పాల్గొన్నారు. గత ఏడాది టెన్త్, ఇంటర్మీడియట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను ఆయన ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమం ఆద్యంతం స్ఫూర్తిదాయకంగా, ఆసక్తికరంగా సాగింది.ఈ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ‘డ్రీమ్ వాల్స్’, ‘గ్రాటిట్యూడ్ వాల్స్’పై విద్యార్థులు రాసిన మాటలు తనను ఎంతగానో ఆకట్టుకున్నాయని లోకేశ్ తెలిపారు. విద్యార్థులు అద్భుతమైన సలహాలు ఇచ్చారని, వారిలో కొంతమంది అయినా రాజకీయాల్లోకి వస్తేనే సమాజంలో మార్పు సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు.

2లో..

# మూడు నెలల పాటు గచ్చిబౌలి రోడ్డు మూసివేత

**- ఐటీ ఉద్యోగులకు బిగ్ అలర్ట్**

**- పోలీసులు సూచించిన ప్రత్యామ్నాయాలు ఇవే**





**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** హైదరాబాద్ నగరంలో రోజురోజుకూ ట్రాఫిక్ సమస్యలు పెరుగుతున్నాయి. విశ్వనగరంగా ఎదుగుతున్న క్రమంలో జనాభా పెరిగిపోవడం, వారికి అనుగుణంగా వాహనాల సంఖ్య పెరగడంతో ట్రాఫిక్ ఇబ్బందులు తప్పడం లేదు. ఈ నేపథ్యంలోనే ఎన్నో ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు, స్కైవేలు నిర్మిస్తున్నారు. నగరంలో ట్రాఫిక్‌ను తగ్గించేందుకు కావాల్సిన అన్ని చర్యలు చేపడుతున్నారు. ఈ క్రమంలోనే గచ్చిబౌలి ట్రిపుల్ ఐటీ జంక్షన్ వద్ద మల్టీ లెవల్ ఫ్లైఓవర్, అండర్‌పాస్ నిర్మిస్తున్నారు. ఈ నిర్మాణ పనులను మరింత వేగంగా పూర్తి చేసేందుకు ఆ రోడ్డును అధికారులు 3 నెలల పాటు మూసివేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా హైదరాబాద్ ఐటీ కారిడార్‌లోని గచ్చిబౌలి-డీఎల్ఎఫ్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్

2లో..

## హరీశ్‌రావుకు
# మెంటల్‌బ్యాలెన్స్ తప్పింది

**- ఖచ్చితంగా కర్ర కాల్చి వాత పెడతా**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీమంత్రి హరీశ్ రావుపై రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. మాజీ మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతున్న తీరుచూస్తుంటే ఆయనకు మెంటల్ బ్యాలెన్స్ తప్పిందనే అనుమానం కలుగుతోందని ధ్వజమెత్తారు. సోమవారం నాడు సచివాలయంలోని తన కార్యాలయంలో తనను కలిసిన మీడియా ప్రతినిధులతో మంత్రి మాట్లాడుతూ దమ్ముంటే అసెంబ్లీని రద్దు చేయాలన్న హరీశ్ రావు వ్యాఖ్యలపై మండిపడ్డారు. తెలంగాణ ప్రజానీకం మాకు ఐదేళ్లకు అధికారమిచ్చారు. రెండున్నరేళ్లకే ఎందుకు అసెంబ్లీని రద్దు చేస్తాం. ఇంకా రెండున్నరేళ్ల సమయం ఉంది. గడచిన రెండున్నర సంవత్సరాలలో జరిగిన ప్రతి ఎన్నికల్లోనూ ప్రజల తీర్పు ఏవిధంగా ఉందో హరీశ్‌రావుకు తెలుసు.ఇప్పుడు కొత్తగా వచ్చే తీర్పు ఏముంది? రెండుకాళ్లు లేనివాడు చూసుకుందాం రా... అని సవాలు విసిరినట్లే బిఆర్ఎస్ నాయకుల సవాళ్లు ఉంటున్నాయి’అని

2లో..

# సంక్షేమం ఓట్లు రాలుస్తాయా..

**విజయవాడ** సంక్షేమ పథకాలే కేవలం అధికారం తెచ్చిపెట్టవని తెలుగుదేశం పార్టీ గుర్తించినట్లుంది. సంక్షేమం అంటూ మళ్లీ ఎన్నికలకు వెళితే జనం మరోసారి అధికారాన్ని అప్పగించే అవకాశం లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది. ఈ విషయాన్ని నారా లోకేశ్ తో పాటు కూటమిలోని మిత్రపక్షమైన జనసేన అధినేత పవన్ కల్యాణ్ కూడా అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కేవలం సంక్షేమంతోనే తిరిగి అధికారంలోకి రావాలని భావిస్తే అది సాధ్యం కాదని, ప్రజలతో మమేకమై ఉంటేనే గెలుస్తామని వారు పదే పదే నేతలకు చెబుతున్నారు. ప్రజలతో ఉన్న సంబంధాలే గెలిపిస్తాయని చెబుతుండటం కూడా ఇప్పుడు ఏపీ రాజకీయాల్లో చర్చనీయాంశమైంది. నిజానికి లోకేశ్, పవన్ కల్యాణ్ ఈ మాటలను బహిరంగంగా చెబుతున్నప్పటికీ చంద్రబాబు మనసులోనూ అదే ఉంటుంది. ఎందుకంటే గత వైసీపీ ప్రభుత్వం కేవలం సంక్షేమ పథకాలను అమలుచేసి తిరిగి అధికారంలోకి రావాలన్న కలను జనం చెదరగొట్టేశారు. పదకొండు సీట్లకే పరిమితం చేశారు. ఈ విషయాన్ని గుర్తించిన కూటమి ప్రభుత్వం కేవలం పింఛన్లు, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత బస్సు, మూడు గ్యాస్ సిలిండర్లు ఇలాంటి పథకాల వల్ల పెద్దగా ప్రయోజనం ఉండదని కూడా అంచనాకు వచ్చినట్లు కనపడుతుంది. అందుకే సూపర్ సిక్స్ లో మిగిలి పోయిన హామీలను అమలు చేసే అవకాశం లేదని కూటమి నేతల మాటలను బట్టి అర్థమవుతుంది. ప్రధానంగా యాభై ఏళ్లు దాటిన వారికి పింఛను, మహిళలకు నెలకు 1,500 రూపాయలు వంటి పథకాలు అమలుకు ఈ మూడేళ్లలో నోచుకునే అవకాశాలు కూడా లేవన్నది స్పష్టంగా తెలుస్తుంది. ఎందుకంటే ఇప్పటికే సంక్షేమ పథకాలను అమలు చేయాలంటే నెల తిరిగే సరికి అప్పులు తేవాల్సిన పరిస్థితి వస్తోంది. ప్రధాన సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. అప్పటికీ కేంద్ర ప్రభుత్వం అంతో ఇంతో సహకారం అందించడం వల్ల ఈ రెండేళ్లు ఆర్థికంగా కొంత ఇబ్బందులు లేకుండా పాలన సాగించారు.

కానీ రానున్న కాలంలో పరిస్థితులు ఎలా ఉంటాయన్నది చెప్పలేని పరిస్థితి. అందుకే సంక్షేమ పథకాలకు మంగళం పాడాలన్న ఉద్దేశ్యంతోనే చంద్రబాబు ప్రభుత్వం ఆలోచన సాగుతున్నట్లుంది. అయితే ప్రస్తుతం కొనసాగిస్తున్న పథకాలు మాత్రం కంటిన్యూ చేసి, మిగిలిన పథకాలు మాత్రం హోల్డ్ లోపెట్టే అవకాశాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి.

### కుల ప్రస్తావన లేకుండా సాధ్యమేనా

జనసేన అధినేత పవన్ కల్యాణ్ లక్ష్యం ఆంధ్రప్రదేశ్ లో నెరవేరుతుందా? అన్నది ఇప్పుడు సందేహంగా మారింది. కులాల ప్రస్తావన చేయకుండానే రాజకీయాలు చేస్తానని పవన్ కల్యాణ్ చెప్పడం ఆచరణలో సాధ్యమేనా? అన్న చర్చ జరుగుతుంది. ఎందుకంటే ఆంధ్రప్రదేశ్ అంటే కులాలతో ముడిపడి ఉన్న రాజకీయం. గత కొన్ని దశాబ్దాలుగా కులాల మధ్యనే రాజకీయం నడుస్తుంది. ఇప్పుడు పవన్ కల్యాణ్ కుల జాడ్యాన్ని కూకటి వేళ్లతో పీకివేయాలని ప్రయత్నించడం సాహసోపేతమైన చర్యగానే చూడాలి. ఆంధ్రప్రదేశ్ లో ఏ రాజకీయ పార్టీ అయినా కులం పునాదుల మీద నడవాల్సిందే. కొన్ని ఏళ్లుగా అన్ని పార్టీలూ అదే కోవలో నడుస్తున్నాయి.రాజకీయ చరిత్ర కుల ప్రస్తావన లేకుండానే... కానీ ఇటీవల పవన్ కల్యాణ్ తాను కులం ప్రస్తావన లేకుండానే రాజకీయాలు చేస్తానని చెప్పడం ఒకింత ఆశ్చర్యకరమే. కులాలు పేరు చెప్పి తాను ఓట్లు అడగనని కూడా పవన్ కల్యాణ్ అనడం వచ్చే ఎన్నికల ప్రచారం వరకూ ఆగాల్సిందే. ఎందుకంటే గత ఎన్నికల్లోనూ పవన్ కల్యాణ్ కులం ప్రస్తావన తెస్తూ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు ట్రోల్ చేస్తున్నారు. కానీ వచ్చే ఎన్నికల్లోనూ కాపు సామాజికవర్గం అండ పవన్ కల్యాణ్ కు అసవరం ఉంటుంది. అప్పుడు ఏం చేస్తారన్నది జనసైనికుల్లోనూ చర్చ మొదలయింది. అయితే పవన్ కల్యాణ్ కు సినిమాల పరంగా కులాలకు, మతాలకు అతీతంగా అభిమానులు ఉన్నారనడంలో ఎలాంటి సందేహం లేదు.బలమైన సామాజికవర్గాన్ని... కానీ రాజకీయాలకు వచ్చే సరికి వేరుగా ఉంటుంది. ఆంధ్రప్రదేశ్ లో 27 శాతం ఓటు బ్యాంకున్న కాపు సామాజికవర్గాన్ని తెలివైన ఏ రాజకీయ నాయకుడు దూరం చేసుకోరు. పవన్ కల్యాణ్ కూడా అదే విశ్వాసంతో ఉన్నట్లు కనిపిస్తుంది. ఎన్నికల సమయానికి తనను వదిలి వెళ్లరన్న ధీమాలో ఆయన ఉన్నారు. కేవలం కాపు సామాజికవర్గం ఓట్లతోనే ఎవరూ గెలవలేరన్న పవన్ కల్యాణ్ మాటల్లోనూ నిజం లేకపోలేదు. అందుకే ముందుగా మిగిలిన సామాజికవర్గ ఓటర్లను దగ్గరకు తీసుకోవడం ప్రధమ లక్ష్యంగా పవన్ కల్యాణ్ పెట్టుకున్నట్లు కనపడుతుంది. చివరకు కాపులు

## కావడిగుండ్ల గ్రామంలో పెద్దపులి సంచారం



**భద్రాద్రి** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం కావడిగుండ్ల గ్రామ శివారులో పెద్దపులి సంచరించి ఎద్దుపై దాడికి యత్నించడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. పశువులు, గ్రామస్థుల అప్రమత్తతతో పులి అడవిలోకి వెళ్లిపోగా, అటవీశాఖ అధికారులు పాదముద్రల ఆధారంగా గాలిస్తూ సాయంత్రం, రాత్రి వేళల్లో ఒంటరిగా అడవికి వెళ్లవద్దని ప్రజలను హెచ్చరించారు.

## రైతులందరికీ ఏరువాక పౌర్ణమి శుభాకాంక్షలు

**– మంత్రి పొన్నం**

**హైదరాబాద్** తెలంగాణ లో సమృద్ధి వర్షాలు పడి రైతులతో పాడి పంటలతో ఆయు ఆరోగ్యాలతో ఉండాలని ఆ భూమాత ను ప్రార్థిస్తూ కూరెళ్ల గ్రామంలో ఏరువాక పౌర్ణమి సందర్భంగా వ్యవసాయ కార్యక్రమాలు ప్రారంభించడం జరిగిందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.మనం జరుపుకుంటున్న ఏరువాక పౌర్ణమి తెలంగాణ రైతాంగ సంస్కృతికి ప్రతీక రైతు కొత్త వ్యవసాయ పనులను ప్రారంభిస్తూ, భూమాతకు, ప్రకృతికి నమస్కరించి మంచి పంటలు పండాలని కోరుకునే పవిత్రమైన రోజు ఇది. అన్నం పరబ్రహ్మ స్వరూపం అని మన పెద్దలు చెప్పారు. ఆ అన్నాన్ని పండించే రైతే ఈ దేశానికి వెన్నెముక. రైతు సంతోషంగా ఉంటేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుంది. అందుకే కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందని మంత్రి అన్నారు.తెలంగాణ ప్రభుత్వం రైతుల అభివృద్ధి కోసం సాగునీటి వసతుల మెరుగుదల, నాణ్యమైన విత్తనాలు, ఎరువుల సరఫరా, వ్యవసాయానికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనతో పాటు రైతులకు అన్ని విధాలుగా అండగా నిలుస్తోంది. ఏరువాక పౌర్ణమి సందర్భంగా రైతులందరూ శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేయాలి. వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తూ నాణ్యమైన విత్తనాలను మాత్రమే ఉపయోగించాలి. నీటిని పొదుపుగా వినియోగిస్తూ ప్రకృతి అనుకూల వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి. వాతావరణ మార్పులను దృష్టిలో ఉంచుకుని పంటల ఎంపికలో జాగ్రత్తలు తీసుకోవాలి. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి అధిక దిగుబడులు సాధించే దిశగా ముందుకు సాగాలి. ఈ పవిత్రమైన రోజున భూమాత ఆశీర్వాదంతో ప్రతి రైతు కుటుంబం ఆనందంగా ఉండాలి ఈ ఖరీఫ్ సీజన్లో సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం ఎల్లప్పుడూ మీకు అండగా ఉంటుందని హామీ ఇస్తున్నాను. ఈరోజు ఏరువాక పౌర్ణమి వ్యవసాయ పనులు ప్రారంభించే రోజు రాష్ట్రంలో సమృద్ధి వర్షాలు పడి పాడి పంటలు పండాలి ఆర్థికంగా మంచి రాబడి రావాలి . రైతే దేశానికి వెన్నెముక..ఈ సీజన్ లో అన్ని పంటలు క్రిమి కీటకాలు లేకుండా ఆర్థికంగా మంచి రాబడి వచ్చేలా ఉండాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నానని అన్నారు.

## జీడిమెట్లలో రోడ్డు ప్రమాదం..
## డివైడర్ను ఢీకొట్టిన డీసీఎం

**– డ్రైవర్‌కు తీవ్ర గాయాలు**

**మేడ్చల్** పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జీడిమెట్ల వద్ద భారీ రోడ్డు ప్రమాదం జరిగింది. కొంపల్లి నుంచి సుచిత్ర వైపు వెళ్తున్న డీసీఎం వాహనం అదుపుతప్పి డివైడర్ను, అనంతరం పక్కనే వెళ్తున్న ఆర్టీసీ బస్సును బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో బస్సులోని 10 మంది ప్రయాణికులు సురక్షితంగా బయటపడగా.. డీసీఎం డ్రైవర్కు తీవ్ర గాయాలయ్యాయి.

## బకాయిలు చెల్లించలేదంటూ
## ప్రభుత్వ పాఠశాలకు తాళం

**ఖమ్మం** ఖమ్మం రూరల్ దానవాయిగూడెం పాఠశాలకు సంబంధించి బకాయిలు ప్రభుత్వం చెల్లించలేదని కాంట్రాక్టర్ అయోధ్య స్కూలు కు తాళం వేసాడు. మన ఊరు?మనబడి పనులకు బిల్లులు చెల్లించలేదని ఆరోపించాడు. కుటుంబంతో కలిసి పాఠశాల వద్ద బైఠాయించి నిరసన తెలిపాడు. అప్పుల ఊబిలో కూరుకుపోయానని, పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసాడు.

## యాదాద్రి థర్మల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు
## వ్యతిరేకంగా బైక్ ర్యాలీ



**యాదాద్రి** యాదాద్రి థర్మల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విద్యుత్ ఇంజనీర్లు, ఉద్యోగులు చేపట్టారు. నల్లబ్యాడ్జీలతో నిరసనకు దిగారు. యాష్ హ్యాండ్లింగ్, బొగ్గు హ్యాండ్లింగ్ టెండర్లు వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేసారు. ప్రైవేటీకరణ జరిగితే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. విధులు బంద్ చేస్తామని యాజమాన్యానికి అల్టిమేటం ఇచ్చారు.

## అప్పన్నను దర్శించుకున్న హోం మంత్రి అనిత

**విశాఖపట్నం** హోంమంత్రి అనిత సోమవారం నాడు సింహాచలం అప్పన్న స్వామిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అంతరాలయంలో ప్రత్యేక పూజలు చేసారు ఆమెకు ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు కప్పస్తంభం ఆలింగనం స్వామివారి దర్శనం అనంతరం పండితులు వేద ఆశీర్వచనం చేసారు. తరువాత స్వామివారి ప్రసాదాన్ని మంత్రి అనితకు అందజేసారు. అప్పన్న స్వామి సన్నిధిలో శివాలయంలో మంత్రి పూజలు చేసారు.

## లోక్ భవన్‌ను ముట్టించిన ఎస్ఎఫ్ఐ

**హైదరాబాద్** కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి అని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ నేతలు లోక్ భవన్ ముట్టడించారు. ఎన్టీయే ను రద్దు చేయాలి. నీట్ పరీక్ష రద్దు చేసి రాష్ట్రాలే పరీక్షలు నిర్వహించుకునే అవకాశం కల్పించాలి అని డిమాండ్ చేసారు. నీట్ పేపర్ లీకేజీ వల్ల ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలను ఆదుకోవాలనీ డిమాండ్ చేసారు. పోలీసులు ఎస్ ఎఫ్ ఐ నేతలను అరెస్ట్ చేసి పంజాగుట్ట పీ ఎస్ కు తరలించారు.

## ఘనంగా వోగ్ ఫ్యాషన్ వీక్2026

**– ఫ్యాషన్ ప్రపంచానికి హైదరాబాద్ వేదిక**

**హైదరాబాద్** ఫ్యాషన్ రంగంలో ప్రతిభను ప్రోత్సహిస్తూ, కొత్త మోడల్స్, డిజైనర్లు, ఫ్యాషన్ ప్రేమికులకు విశిష్ట వేదిక వోగ్ ఫ్యాషన్ వీక్ 2026 ప్రతిష్ఠాత్మక ఫ్యాషన్ వేడుక నగరంలో హోటల్ కత్రియ లో ఘనంగా జరిగింది.యువతలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడంతో పాటు ఫ్యాషన్ రంగంలో కెరీర్‌ను నిర్మించుకోవాలనుకునే వారికి ఇది అరుదైన అవకాశమని నిర్వాహకులు పేర్కొన్నారు.వివిధ రంగాల్లో పనిచేస్తూ ఫ్యాషన్ పై మక్కువతో ఉన్నవారికి ఇది ఒక్క చక్కని అవకాశం అని ప్రముఖ షోషలైట్, మోడల్, సుధ జైన్ అన్నారు హైదరాబాద్‌ను ఫ్యాషన్ రంగంలో ప్రపంచ స్థాయిలో మరింత గుర్తింపు తీసుకొచ్చే విధంగా ఇ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వి 2 వి ఈవెంట్స్ ఫౌండర్ వోగ్ ఫ్యాషన్ వీక్ నిర్వాహకురాలు వందన దాసరి తెలిపారు.ఇ సందర్భంగా వోగ్ ఫ్యాషన్ వీక్ మ్యాగజైన్ ఆవిష్కరించారు

# అర్ధరాత్రి గిరిజన
## బాలికల హాస్టల్‌లో కలకలం

**– హాస్టల్ భవనం పైనుంచి దూకిన ఇంటర్ విద్యార్థిని మహేశ్వరి**
**– కాలు విరగడంతో గాంధీ ఆస్పత్రికి తరలింపు – ఘటనపై విచారణ ప్రారంభం**

వికారాబాద్ జిల్లా తాండూరు మండలం జిన్ గుర్తి గ్రామ సమీపంలో ఉన్న హాస్టల్లో సంఘటన వికారాబాద్ జిల్లా తాండూరు మండలం జిన్గుర్తి గ్రామ శివారులో ఉన్న గిరిజన బాలికల వసతి గృహంలో సోమవారం అర్ధరాత్రి జరిగిన ఘటన కలకలం రేపింది. హాస్టల్‌లో ఉంటూ ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థిని మహేశ్వరి హాస్టల్ భవనం పై నుంచి దూకినట్లు సమాచారం.ఈ ఘటనలో ఆమె కాలుకు తీవ్ర గాయమై ఎముక విరగడంతో తొలుత స్థానికంగా ఉన్న ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించి లో చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితిపై వైద్యులు పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు.విద్యార్థిని భవనం పై నుంచి ఎందుకు దూకింది అనే విషయంపై స్పష్టత రావాల్సి ఉంది. కుటుంబ సమస్యల కారణంగానా, లేక ఇతర వ్యక్తిగత లేదా విద్యాసంబంధిత కారణాలున్నాయా అనే కోణంలో అధికారులు విచారణ చేపట్టినట్లు తెలుస్తోంది.ఘటనపై సమాచారం అందుకున్న సంబంధిత అధికారులు హాస్టల్‌ను సందర్శించి వివరాలు సేకరిస్తున్నారు. విద్యార్థినితో పాటు హాస్టల్ సిబ్బంది, తోటి విద్యార్థుల నుంచి కూడా వివరాలు తెలుసుకునే ప్రయత్నం జరుగుతోంది.ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు, అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. విచారణ అనంతరం అసలు కారణాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

# గుర్రంగూడ ఫారెస్ట్‌లో
## కేబీఆర్ తరహా ఎకో పార్కు..

**హైదరాబాద్,** హైదరాబాద్ నగర శివారులోని గుర్రంగూడ రిజర్వ్ ఫారెస్ట్‌లో బంజారాహిల్స్ కేబీఆర్ పార్కు తరహాలో అధునాతన ఎకో పార్కు ఏర్పాటుకు అటవీశాఖ పనులు ప్రారంభించింది. సుప్రీంకోర్టు తీర్పు ద్వారా ఆక్రమణదారుల నుంచి స్వాధీనం చేసుకున్న అటవీ భూమిలో 142 ఎకరాల విస్తీర్ణంలో రూ.15 కోట్ల వ్యయంతో ఈ పార్కును నిర్మిస్తున్నారు. సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేసిన ఈ ప్రాజెక్టును ఈ ఏడాది డిసెంబరు లోపు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో సైక్లింగ్ ట్రాక్‌లు, వాక్‌వేలు, ధ్యానమందిరాలతో పాటు సందర్శకుల రద్దీ నియంత్రణకు ఐదు ప్రవేశ ద్వారాలను ఏర్పాటు చేయనున్నారు.హైదరాబాద్ నగర శివారులోని గుర్రంగూడ రిజర్వ్ ఫారెస్ట్‌లో అత్యాధునిక హంగులతో సరికొత్త ఎకో పార్కు ఏర్పాటుకు అటవీశాఖ ముమ్మర కార్యాచరణ ప్రారంభించింది. బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కును తలపించేలా.. అన్ని రకాల అధునాతన సౌకర్యాలతో ఈ పార్కును రూపొందించనున్నారు. ఈ నెల 18న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ ప్రాజెక్టుకు అధికారికంగా శంకుస్థాపన చేశారు. అనంతరం అటవీశాఖ అధికారులు ఇందుకు సంబంధించిన ప్రతిపాదిత నివేదికను ఉన్నతాధికారుల ఆమోదం కోసం పంపించారు. సుమారు రూ.15 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టే ఈ ఎకో పార్కు పనులను ఈ ఏడాది డిసెంబరులోపే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులు గడువుగా నిర్దేశించుకున్నారు.గుర్రంగూడ రిజర్వ్ ఫారెస్ట్ మొత్తం 424 ఎకరాల విస్తీర్ణంలో ఉండగా.. అందులో 142 ఎకరాలను ప్రత్యేకంగా ఎకో పార్కు అభివృద్ధి కోసం కేటాయించారు. ఈ పార్కులో సందర్శకుల కోసం సైక్లింగ్ ట్రాక్‌లు, ఆహ్లాదకరమైన వాక్‌వేలు, ప్రశాంత వాతావరణంలో యోగా చేసుకునేందుకు ధ్యానమందిరాలను నిర్మించనున్నారు. అలాగే వివిధ అధికారిక, అనధికారిక సమావేశాల నిర్వహణకు వేదికలు, సందర్శకులు కూర్చుని మాట్లాడుకునేందుకు వీలుగా పచ్చిక బయళ్లలో ప్రత్యేక బెంచీలను ఏర్పాటు చేయనున్నారు. రోజుకు సుమారు 30 వేల మంది సందర్శకులు వచ్చినా తట్టుకునేలా ఈ పార్కును తీర్చిదిద్దుతున్నారు. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో వందలాది మంది ఒకేసారి వస్తే ప్రవేశ ద్వారాల వద్ద రద్దీ ఏర్పడకుండా ఉండేందుకు వీలుగా పార్కుకు ఐదు వేర్వేరు చోట్ల ప్రధాన ప్రవేశ ద్వారాలను నిర్మిస్తున్నారు. వారాంతాల్లో కుటుంబాలతో గడిపేవారి కోసం ప్రత్యేక యాక్టివిటీ జోన్లు, పిల్లల వినోదం కోసం ప్లేజోన్లను కూడా సిద్ధం చేస్తున్నారు.గతంలో గుర్రంగూడ అటవీ ప్రాంతాన్ని కొందరు ప్రైవేటు వ్యక్తులు తమ భూములంటూ ఆక్రమించుకుని కోర్టులను ఆశ్రయించి సుప్రీంకోర్టు వరకు వెళ్లారు. ఈ క్రమంలో ఇబ్రహీంపట్నం ఫారెస్ట్ రేంజ్ అధికారి డాక్టర్ కె.శ్రీనివాస్‌రెడ్డి, డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ అధికారి కస్నా నాయక్‌లు లీగల్ టీమ్‌తో కలిసి పక్కా ఆధారాలు సేకరించారు.ద

ప్రైవేటు వ్యక్తులు కోర్టులో సమర్పించిన ధ్రువపత్రాలు నకిలీవని నిరూపించడంలో వారు విజయం సాధించారు. దీంతో ఆ భూములు పూర్తిగా అటవీశాఖవేనని స్పష్టం చేస్తూ గతేడాది సుప్రీంకోర్టు చారిత్రాత్మక తీర్పునిచ్చింది. ఈ తీర్పు అనంతరం అటవీశాఖ ఆక్రమణలను తొలగించి రికార్డులను సరిచేసింది.

# రాజకీయాలకు గుడ్ బై

**కడప,** కడప జిల్లాలో రాజకీయాలు మారుతున్నాయి. ముఖ్యంగా కూటమి దూకుడుగా ముందుకు సాగుతోంది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉక్కిరి బిక్కిరి అవుతోంది. గత ఎన్నికల్లో ఎదురైన ఓటమిని తట్టుకొని మళ్లీ పూర్వ వైభవం దిశగా అడుగులు వేసే క్రమంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా వైయస్ రాజశేఖర్ రెడ్డి కుటుంబంలో వివాదం సద్దుమణగడం లేదు. రోజురోజుకు ఆ సమస్య పెరుగుతుందే తప్ప తగ్గడం లేదు. ఈ నేపథ్యంలో కడప ఎంపీ అవినాష్ రెడ్డి జగన్మోహన్ రెడ్డికి తేల్చేసినట్లు ప్రచారం నడుస్తోంది.కడప జిల్లాలో 1978లో తొలిసారిగా అసెంబ్లీకి పోటీ చేశారు రాజశేఖర్ రెడ్డి. అలా గెలిచిన రాజశేఖర్ రెడ్డి మంత్రిగా కూడా బాధ్యతలు స్వీకరించారు. నాటి నుంచి రాజశేఖర్ రెడ్డి కుటుంబ హవా కడప జిల్లాలో కొనసాగుతూ వస్తోంది. రాజశేఖర్ రెడ్డి ది ఉమ్మడి కుటుంబం. ఈ పరిస్థితుల్లో రాజశేఖర్ రెడ్డి రాష్ట్ర రాజకీయాల్లో ఒకవైపు రాణిస్తుంటే.. కడప జిల్లా బాధ్యతలు వైయస్ వివేకానంద రెడ్డి చూసేవారు

కుటుంబంలో ఎంతోమంది ఉన్నా వివేకాకు ఛాన్స్ ఇచ్చారు రాజశేఖర్ రెడ్డి. అన్న ఆదేశాలను క్రమం తప్పకుండా పాటించేవారు వివేకానంద రెడ్డి. ఈ క్రమంలో ప్రస్తుత ఎంపీ అవినాష్ రెడ్డి తండ్రి భాస్కర్ రెడ్డి ఉన్న రాజకీయంగా పెద్దగా ప్రాధాన్యం ఉండేది కాదు. ఎప్పుడైతే రాజశేఖర్ రెడ్డి చనిపోయారో.. నాటి నుంచి వివేకానంద రెడ్డి ప్రాధాన్యత తగ్గించి.. భాస్కర్ రెడ్డి కుటుంబానికి ప్రాధాన్యం ఇచ్చారు జగన్మోహన్ రెడ్డి.2014 తర్వాత ఒక ప్రత్యేక పరిస్థితుల్లోనే వివేకానంద రెడ్డి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయనకు జిల్లా పై ఉన్న పట్టు దృష్ట్యా జగన్మోహన్ రెడ్డి పార్టీలోకి తెచ్చుకున్నారు. అయితే రాజశేఖర్ రెడ్డి మాదిరిగా వివేకానంద రెడ్డికి జగన్మోహన్ రెడ్డి పెద్దగా ప్రాధాన్యం కల్పించలేదు. 2019 ఎన్నికల్లో కడప పార్లమెంటు సీటు షర్మిలకు ఇద్దామని ప్రతిపాదించారు వివేకానంద రెడ్డి. అటు తరువాత వివేకానంద రెడ్డి హత్యకు గురి కావడం.. అది రాజకీయ లబ్ధి కోసం చేసిన హత్య అని.. అవినాష్ రెడ్డి తో పాటు ఆయన తండ్రి భాస్కర్ రెడ్డి చేయించారంటూ వివేక కుమార్తె సునీత, వైయస్ షర్మిల సైతం ఆరోపించారు. ప్రజల్లోకి ఈ అంశం బలంగా వెళ్ళింది. అవినాష్ రెడ్డి తక్కువ ఓట్లతో మొన్నటి ఎన్నికల్లో బయటపడ్డారు.అయితే ఇప్పుడు వివేకానంద రెడ్డి హత్య కేసు మళ్లీ రీఓపెన్ అయింది.

ఈసారి ఎంపీ అవినాష్ రెడ్డి చుట్టూ ఉచ్చు బిగించడం ఖాయం. పైగా మునుపటిలా కేంద్ర ప్రభుత్వ సహాయం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి లేదు. అందుకే ఈసారి దొరికిపోతామని అవినాష్ రెడ్డికి తెలుసు. ఆపై రాజకీయ ప్రత్యర్థులు బిటెక్ రవి, రెడ్డప్ప గారి మాధవి రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి లాంటి వారు పట్టు బిగిస్తున్నారు రాజకీయంగా. మునుపటిలా జిల్లాలో రాజకీయాలు చేయలేమని అవినాష్ రెడ్డి గుర్తించారు. అందుకే జగన్మోహన్ రెడ్డికి తేల్చి చెప్పారు. తనకు బాధ్యతలు నుంచి తప్పించాలని.. వచ్చే ఎన్నికల్లో ఎంపీగా పోటీ చేయనని కుండ బద్దలు కొట్టి చెప్పినట్లు ప్రచారం నడుస్తోంది. అందులో ఎంత నిజం ఉందో చూడాలి.

# అద్దెకు బాయ్‌ఫ్రెండ్..
## లైంగిక సేవల పేరుతో వీడియోలు..

**హైదరాబాద్,** సోషల్ మీడియాలో వ్యూస్, లైకుల కోసం కొందరు ఇన్‌ఫ్లూయెన్సర్లు విచక్షణ లేకుండా ప్రవర్తిస్తున్నారు. అర్ధరాత్రి మద్యం దొరికే ప్రదేశాలు, అశ్లీల వెబ్‌సైట్లు, వ్యభిచార కేంద్రాలంటూ అసభ్యకర వీడియోలను పోస్టు చేస్తూ పోలీసులకు చిక్కుతున్నారు. ఇలా అడ్డదారులు తొక్కుతున్న వారిలో డిగ్రీ, ఇంజినీరింగ్ పూర్తి చేసిన విద్యావంతులే ఎక్కువగా ఉండటం ఆందోళన కలిగిస్తోంది. సమాజంలో చిచ్చుపెట్టేలా, నేరాలను ప్రోత్సహించేలా పోస్టులు పెట్టే వారిపై పోలీసులు సైబర్ పెట్రోలింగ్ ద్వారా నిఘా పెట్టారు. ఈ ఏడాది నాలుగు కమిషనరేట్లలో కలిపి ఇప్పటివరకు సుమోటోగా 456 కేసులు నమోదు చేశారు.ప్రస్తుతం సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్ల పేరుతో కొందరు చేస్తున్న చేష్టలు పరాకాష్టకు చేరుతున్నాయి. ఇన్‌స్టాగ్రామ్ రీల్స్, యూట్యూబ్ వీడియోలకు వ్యూస్, లైకులు సాధించడమే లక్ష్యంగా నైతిక విలువలను పూర్తిగా గాలికి వదిలేస్తున్నారు. హైదరాబాద్ నగరంలో అర్ధరాత్రి వేళల్లో మద్యం దొరికే రహస్య ప్రదేశాలు, ఆన్‌లైన్‌లోని అశ్లీల వీడియోల వెబ్‌సైట్ల వివరాలు, నగరంలో ఫలానా ప్రాంతంలో వ్యభిచారం జరుగుతోందంటూ మహిళలతో మాట్లాడుతున్న వీడియోలను చిత్రీకరించి సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేస్తున్నారు. కేవలం ఫాలోవర్లను పెంచుకోవడానికి సమాజంపై ఎలాంటి ప్రభావం పడుతుందనే కనీస విచక్షణ లేకుండా ప్రవర్తిస్తున్నారు. నగరానికి చెందిన ఓ యువకుడు ఇంజినీరింగ్ పూర్తిచేసి మంచి ఉద్యోగ ప్రయత్నాలు చేయాల్సింది పోయి సామాజిక మాధ్యమాల్లో పాపులర్ అవ్వడానికి అడ్డదారులు తొక్కాడు. ‘అద్దెకు బాయ్‌ఫ్రెండ్.. లైంగిక సేవలు’ అంటూ సమాజం తలదించుకునేలా వీడియోలు రూపొందించాడు. కొద్ది రోజుల్లోనే వీటికి వ్యూస్, లైకులు విపరీతంగా వచ్చాయి. అయితే ఈ వ్యవహారాన్ని గమనించిన పోలీసులు.. సదరు వీడియోలు వ్యభిచారాన్ని, అసాంఘిక కార్యకలాపాలను ప్రోత్సహించేలా ఉన్నాయని నిర్ధారించి, పలు కఠిన సెక్షన్ల కింద ఆ యువకుడి ఛానల్‌పై కేసు నమోదు చేశారు.

మరో ఘటనలో నిజామాబాద్ జిల్లాకు చెందిన ఓ కుర్రాడు డిగ్రీ పూర్తయ్యాక పోటీ పరీక్షల కోచింగ్ కోసం హైదరాబాద్‌కు వచ్చాడు. అమీర్‌పేటలోని ఒక రూమ్‌లో ఉంటూ.. అర్ధరాత్రి వేళల్లో స్నేహితులతో కలిసి తిరుగుతూ సరదాగా వీడియోలు చేయడం ప్రారంభించాడు. వీటికి ఆదరణ పెరగడంతో మరింత వేగంగా పాపులర్ అవ్వాలనే దురాశతో అడ్డదారి తొక్కాడు. నగరంలో ఫలానా ప్రాంతంలో వ్యభిచారం జరుగుతోందంటూ నిరాధారమైన వీడియోలను చిత్రీకరించి పోస్టు చేయడంతో చివరకు పోలీసుల నిఘాకు దొరికిపోయాడు.అసభ్య పోస్టులు, కామెంట్లతో కూడిన వీడియోలు పెడుతూ పోలీసులకు చిక్కుతున్న వారిలో అత్యధికులు డిగ్రీ, ఇంజినీరింగ్ పూర్తి చేసిన విద్యావంతులైన విద్యార్థులే కావటం గమనార్హం. ఇది తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. పోలీసులు విచారణకు పిలిచినప్పుడు వీరంతా తల దించుకుంటున్నారు. మంచి సమాచారం అందించే వీడియోలు చేస్తే జనాలు చూడటం లేదని, ఇలాంటి వివాదాస్పద వీడియోలు చేస్తేనే లైక్స్ ఎక్కువగా వచ్చి వేగంగా పాపులర్ అవుతామనే ఉద్దేశంతోనే ఈ తప్పులు చేసినట్లు పోలీసుల ఎదుట అంగీకరిస్తున్నారు. ఈ తరహా అసాంఘిక, అసభ్యకర పోస్టుల ద్వారా సమాజంలో భిన్న వర్గాల మధ్య చిచ్చుపెట్టే వారిపై పోలీసులు నిఘా తీవ్రం చేశారు. ఇందుకోసం సైబర్ పెట్రోలింగ్‌ను విస్తృతం చేస్తూ.. బాధితుల ఫిర్యాదులతో సంబంధం లేకుండా పోలీసులే సుమోటోగా కేసులు నమోదు చేస్తున్నారు. నేరం తీవ్రతను బట్టి కఠినమైన ఐటీ యాక్ట్, ఇతర క్రిమినల్ సెక్షన్లను జోడిస్తున్నారు. ఈ ఏడాది ఇప్పటివరకు హైదరాబాద్ పరిధిలోని నాలుగు పోలీస్ కమిషనరేట్లలో కలిపి మొత్తం 456 కేసులు నమోదవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది.

## హోటళ్లకు కుళ్ళిన చికెన్,
# ఆటోను అడ్డుకున్న స్థానికులు

**- షాద్ నగర్‌లో కొన్ని హోటల్ నిర్వాహకుల అడ్డగోలు వ్యవహారం..**

ధర తక్కువగా వస్తుందని ఆశతో... చనిపోయిన, అనారోగ్యంతో ఉన్న కోళ్ల మాంసం కొనుగోలు చేసి ప్రజల ఆరోగ్యంతో చెలగాటలాడుతున్నాయి షాద్ నగర్ పట్టణంలోని కొన్ని హోటల్లు. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలో మహబూబ్ నగర్ నుండి ఆటోలో చికెను ను తరలిస్తుండగా స్థానిక వ్యాపారులు పట్టుకుని మున్సిపల్ అధికారులకు అప్పగించారు.

ఆటోలో ఉన్న మాంసాన్ని పరిశీలించగా.... అనారోగ్యం తో చని పోయిన, డ్యామేజ్ అయిన కోళ్ల మాంసం తరలిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ ఘటన పై మున్సిపల్ కమిషనర్ సునీత స్పందిస్తూ ఆటోను సీజ్ చేశారు. ఇలాంటి కుళ్ళిన మాంసం కొనుగోలు చేస్తున్న హోటల్స్ పై చర్యలు తీసుకుంటామని కమిషనర్ తెలిపారు.

## తాండూర్ లయన్స్ క్లబ్‌కు
# నూతన సారథ్యం..

**- అధ్యక్షుడిగా ఠాకూర్ ఉమ్రావ్ సింగ్**

**- సేవా కార్యక్రమాల విస్తరణే లక్ష్యమన్న నూతన అధ్యక్షుడు**




**తాండూర్:** సేవా కార్యక్రమాలకు చిరునామాగా నిలిచిన లయన్స్ క్లబ్ ఆఫ్ తాండూర్ 2026?2027 సంవత్సరానికి నూతన కార్యవర్గం బాధ్యతల స్వీకరణ కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు.లయన్ ఠాకూర్ ఉమ్రావ్ సింగ్ అధ్యక్షుడిగా, లయన్ తాటిపాముల సాంబమూర్తి కార్యదర్శిగా, లయన్ జి. రాజన్న కోశాధికారిగా బాధ్యతలు స్వీకరించారు. పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ రిక్కల నారాయణ రెడ్డి ముఖ్య అతిథిగా, ప్రతిష్ఠాపన అధికారిగా పాల్గొని నూతన కార్యవర్గానికి బాధ్యతలు అప్పగించారు. రీజియన్ ఛైర్‌పర్సన్ లయన్ బొమ్మ బాపు రెడ్డి,రీజనల్ కోఆర్డినేటర్ దుద్దిల్ల నారాయణరావు లు ప్రత్యేక అతిథిగా హాజరై శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు ఠాకూర్ ఉమ్రావ్ సింగ్ మాట్లాడుతూ, లయన్స్ క్లబ్ సేవా స్ఫూర్తిని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి సభ్యుడితో కలిసి పనిచేస్తామని తెలిపారు. విద్య, వైద్యం, రక్తదాన శిబిరాలు, పేదలకు చేయూత, పర్యావరణ పరిరక్షణతో పాటు సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించి ప్రజలకు అండగా నిలుస్తామని పేర్కొన్నారు.అనంతరం నూతన కార్యవర్గ సభ్యులను ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు లయన్ డి. రాజయ్య, మాజీ కార్యదర్శి లయన్ ఎం. బాల ప్రసాద్, మాజీ కోశాధికారి లయన్ కె. సంతోష్, ప్రోగ్రామ్ ఛైర్‌పర్సన్ లయన్ ఎం. రాంచందర్ తోపాటు లయన్స్ క్లబ్ సభ్యులు, ప్రముఖులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సాకారంతో
# దర్బాతాండ గ్రామంలో తీరిన నీటి కష్టాలు

**- ఎమ్మెల్యే అనిల్ జాదవ్ చిత్రపటానికి పాలాభిషేకం చేసిన గ్రామస్తులు**



నెరడిగొండ మండలంలోని దర్బాతాండ గ్రామంలో నీటి సమస్య ఉందని గ్రామస్తులు ఎమ్మెల్యే అనిల్ జాదవ్ దృష్టికి తీసుకెళ్లగా తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే అనిల్ జాదవ్ గ్రామంలో బోరు వేయించి గ్రామస్తుల నీటి కష్టాలు తీర్చినందుకు గ్రామస్తులు ఎమ్మెల్యే అనిల్ జాదవ్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. గ్రామస్తులు తదితరులు ఉన్నారు

# కాజీపేటలో భారీగా గంజాయి పట్టివేత

**- ఇద్దరు నిందితుల అరెస్ట్ ఆటో సీజ్**




**హనుమకొండ** హనుమకొండ జిల్లా కాజీపేట పరిధిలో అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న ముఠాను పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. అరెస్ట్ చేసిన ఇద్దరు నిందితుల నుంచి సుమారు రూ.70,000 విలువైన గంజాయిని, రవాణాకు ఉపయోగించిన ఆటోను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.ఘటన వివరాలు:? కాజీపేట ఉమెన్ సబ్-ఇన్‌స్పెక్టర్ ఎస్. మౌనిక కాజీపేట ఏరియాలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో కడిపికొండ బ్రిడ్జి కింద ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా ప్లాస్టిక్ కవర్‌తో కనిపించారు. పోలీసులను చూడగానే వారు పారిపోవడానికి ప్రయత్నించగా, అప్రమత్తమైన సిబ్బంది వారిని వెంబడించి పట్టుకున్నారు.

**నిందితుల వివరాలు:** విచారణలో నిందితులను ఈ కింది విధంగా గుర్తించారు.బొల్ల ప్రవీణ్ కుమార్ కడిపికొండ, హనుమకొండ నివాసి వృత్తి డైరీ ఫామ్,మొహమ్మద్ అఫ్జల్ పాషా కాజీపేట నివాసి వృత్తి ఆటో డ్రైవర్,ఈ కేసులో మరో నిందితుడైన ఎండి సల్మాన్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.మహారాష్ట్ర నుంచి సరఫరా?పోలీసుల ప్రాథమిక విచారణలో నిందితులు గతంలో స్టైట్ జాన్ స్కూల్‌లో చదువుకున్నప్పటి నుండి గంజాయికి బానిసలయ్యారని తేలింది. సులభంగా డబ్బు సంపాదించాలనే దురాశతో, మహారాష్ట్రలో తక్కువ ధరకు రూ.10,000 గంజాయిని కొనుగోలు చేసి, ఇక్కడ కాజీపేట ప్రాంతంలో రూ. 70,000కు విక్రయించేందుకు ప్లాన్ చేశారు. ఈ క్రమంలోనే ఆటో లో తరలిస్తుండగా పోలీసులకు చిక్కారు.స్వాధీనం చేసుకున్న సొత్తు:గంజాయి1 కేజీ 400 గ్రాములు విలువ సుమారు రూ. 70,000,వాహనం బజాజ్ ఆటోరెండు సెల్ ఫోన్లు రెడ్‌మి13 ప్రో మరియు ఒప్పో ౦96,చట్టపరమైన చర్యలుకాజీపేట తహసిల్దార్ సమక్షంలో గంజాయిని తూకం వేసి, నిబంధనల ప్రకారం సీజ్ చేశారు.

# రైతుకు భరోసా... వ్యవసాయానికి పునర్వైభవం

- రైతు సంక్షేమం, వ్యవసాయ రంగాన్ని గాడిలో పెట్టడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం - మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు - వ్యవసాయ రంగంలో సాంకేతిక విప్లవానికి శ్రీకారం, శాస్త్రీయ సాగుతోనే రైతుకు స్థిరమైన ఆదాయం
- రైతు ఆదాయం పెంచడమే ప్రభుత్వ సంకల్పం, ఎరువులు, విత్తనాల సరఫరాలో పారదర్శకతకు పెద్దపీట - వైసీపీ పాలనలో వ్యవసాయ, నీటిపారుదల శాఖలు తీవ్ర నిర్లక్ష్యానికి గురయ్యాయి
- విత్తన కంపెనీల బకాయిలు చెల్లించి సరఫరా వ్యవస్థను గాడిలో పెట్టాం - రాష్ట్రంలో ఎక్కడా ఎరువుల కొరత లేదు,ప్రత్యేక యాప్‌తో ఎరువుల పంపిణీ
- 20 రోజుల్లోనే 15 లక్షలకుపైగా ఎరువుల బస్తాల పంపిణీ, మూడు లక్షలకుపైగా కౌలు రైతులకు యాప్ ద్వారా ప్రయోజనం
- మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా పంటల సాగు చేయాలి, ఒకే పంటపై ఆధారపడితే రైతుకు నష్టం తప్పదు
- ఉద్యానవన పంటలతో రైతు ఆదాయం పెంచే దిశగా చర్యలు - రైతు అభ్యున్నతే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యం
- గుంటూరులోని ఏన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఏరువాక పౌర్ణమి కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించిన వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



**అమరావతి/గుంటూరు, జూన్ 29:** రైతు సంతోషంగా ఉంటేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని, రైతుకు భరోసా కల్పించి, వ్యవసాయ రంగానికి పునర్వైభవం తీసుకురావడమే ఎన్డీఏ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. సోమవారం గుంటూరులో లాంఫాం నందు గల ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఏరువాక పౌర్ణమి కార్యక్రమాన్నిపొలంలో ఎద్దుల అరక దున్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ వ్యవసాయానికి తొలి పండుగ అయిన ఏరువాకను గుంటూరులో నిర్వహించడానికి ప్రత్యేక కారణం ఉందని, రైతాంగానికి గుంటూరు జిల్లాతో అవినాభావ సంబంధం ఉన్నందున ఈ కార్యక్రమాన్ని ఇక్కడ నిర్వహించామని తెలిపారు. రాష్ట్ర జనాభాలో దాదాపు 66 శాతం మంది వ్యవసాయం, అనుబంధ రంగాలపై ఆధారపడి జీవిస్తున్నారని, అందువల్ల వ్యవసాయ రంగానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో తీవ్రంగా దెబ్బతిన్న వ్యవసాయ రంగాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రెండేళ్లలో గాడిలో పెట్టగలిగాం. రైతుకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, సాంకేతిక పరిజ్ఞానం, మార్కెట్ అనుసంధానం వంటి అన్ని అంశాల్లో ప్రభుత్వం సమగ్ర చర్యలు చేపట్టింది. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చి రైతు ఆదాయం పెంచడమే ఎన్డీయే కూటమి ప్రభుత్వ సంకల్పం అని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు.గత వైసీపీ ప్రభుత్వ హయాంలో వ్యవసాయం, నీటిపారుదల వంటి కీలక రంగాలు పూర్తిగా నిర్లక్ష్యానికి గురయ్యాయని విమర్శించారు. రైతు భరోసా కింద సంవత్సరానికి రూ.7,500 ఇవ్వడం మినహా రైతుకు ఉపయోగపడే అనేక పథకాలను నిలిపివేశారని, విత్తన కంపెనీలకు వందల కోట్ల రూపాయల బకాయిలు పెట్టి విత్తన సరఫరా వ్యవస్థను దెబ్బతీశారని అన్నారు. గత ప్రభుత్వ బకాయిలను దశలవారీగా చెల్లించి, రాయితీపై రైతులకు నాణ్యమైన విత్తనాలను సబ్సిడీపై అందిస్తున్నామని చెప్పారు. రైతులు సంప్రదాయ సాగు విధానాలతో పాటు మార్కెట్ అవసరాలు, శాస్త్రవేత్తల సూచనలకు అనుగుణంగా పంటల సాగు చేయాలని మంత్రి సూచించారు. ఒక సంవత్సరం ధరలు బాగున్నాయని ఒకే పంటను అధికంగా సాగు చేస్తే మరుసటి ఏడాది ధరలు పడిపోయి రైతులు నష్టపోయే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. మిర్చి, పొగాకు వంటి పంటల విషయంలో గత అనుభవాలు దీనికి నిదర్శనమని పేర్కొన్నారు.

అధిక కెమికల్స్ ఉపయోగించడం వలన ఇటీవల చైనాకు వెళ్లిన గుంటూరు మిర్చి కంటైనర్స్ తిరిగి వెనక్కి వచ్చిన సందర్భాలు గుర్తుచేసుకోవాలని తెలిపారు. ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపిక చేసుకోవాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. వ్యవసాయ శాఖ కూడా నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ రైతులకు మార్గనిర్దేశం చేస్తోందన్నారు. ఉద్యానవన, పశుసంవర్ధక, మత్స్య, పట్టు పరిశ్రమ, సహకార శాఖలు సమన్వయంతో పనిచేస్తూ ఎల్‌నినో ప్రభావాన్ని తగ్గించే చర్యలను అమలు చేస్తున్నాయని మంత్రి వెల్లడించారు. రైతులకు అవసరమైన సాంకేతిక సలహాలు, వాతావరణ హెచ్చరికలు, పంటల నిర్వహణ సూచనలు గ్రామ స్థాయి వరకు చేరేలా విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. ఎలాంటి వాతావరణ సవాళ్లు ఎదురైనా రైతులను ఆదుకునేందుకు అవసరమైన అన్ని చర్యలు సిద్ధంగా ఉన్నాయని మంత్రి స్పష్టం చేశారు.

## అంగన్వాడీ సెంటర్లకు
# ఎలక్ట్రికల్ స్టవ్లు పంపిణీ



**- ముఖ్యఅతిథిగాఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు**

**పిడుగురాళ్ల** పర్యావరణ పరిరక్షణలో భాగంగా కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా వున్న 44,346 అంగన్వాడి సెంటర్లకు ఎలక్ట్రికల్ స్టవ్( ఇండక్షన్ స్టవ్)లు, పాత్రలు పంపిణీలో భాగంగా గురజాల నియోజకవర్గంలోని 315 అంగన్వాడి సెంటర్లకు పంపిణీ చేశారు. ఈ మేరకు సోమవారం పిడుగురాళ్ల పట్టణంలోని ఎండిఓ కార్యాలయం కాంపౌండ్ లోని, ఐసిడిఎస్ కార్యాలయం నందు పిడుగురాళ్ల ఐసిడిఎస్ మరియు గురజాల ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ఎలక్ట్రికల్ స్టవ్ (ఇండక్షన్ స్టవ్)లు పాత్రలను అంగన్వాడీ సెంటర్లకు పంపిణీ కార్యక్రమంలో గురజాల శాసనసభ్యులు యరపతినేని శ్రీనివాసరావు పాల్గొని ఎలక్ట్రికల్ స్టవ్ (ఇండక్షన్ స్టవ్)లు పాత్రలను అంగన్వాడీ సెంటర్ల టీచర్లకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముందుగా ఐసిడిఎస్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వివిధ రకాల స్టాల్స్ ని యరపతినేని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే యరపతినేని తో పాటు బిజెపి పల్నాడు జిల్లా అధ్యక్షులు ఏలూరి శశి కుమార్, పట్టణ టిడిపి అధ్యక్షులు పిల్లి చెన్నారావు, పిడుగురాళ్ల మండల టిడిపి అధ్యక్షులు గండికోట వెంకటేశ్వర్లు, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షేక్ బాబావలి, పిడుగురాళ్ల మున్సిపాలిటీ మాజీ అధ్యక్షులు కొత్త వెంకట సుబ్బారావు, పిడుగురాళ్ల మున్సిపల్ కమిషనర్ ఇరువురి శ్రీనివాసులు, పిడుగురాళ్ల మార్కెట్ యార్డ్ చైర్మన్ తురక వీరస్వామి, తెలుగుదేశం పార్టీ గురజాల నియోజకవర్గ మహిళ నాయకురాలు చల్లగుండ్ల సీత, పిడుగురాళ్ల పట్టణ మహిళా అధ్యక్షురాలు నిర్మల, మాచవరం మండల టిడిపి అధ్యక్షులు బడిగుంచల వెంకటేశ్వర్లు, పిడుగురాళ్ల సిడిపిఓ రాజేశ్వరి, పలువురు సూపర్వైజర్లు, పలువురు కూటమి నాయకులు, అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

## విశాఖ స్టీల్ ప్లాంట్ల బాధితులకు
# కోటి పరిహారం ఇవ్వాలి

**- క్షతగాత్రులకు 50 లక్షలు పరిహారం చెల్లించాలి - జులై 3న కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన**

**- కార్మిక సంఘాల నాయకులు పిలుపు**




**నరసరావుపేట** :నరసరావుపేట పట్టణంలోని ఏఐటియుసి కార్యాలయంలో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సోమవారం విలేకరుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఏఐటీయూసీజిల్లా ప్రధాన కార్యదర్శి కాసా రాంబాబు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ ఆంజనేయులు నాయక్ లు మాట్లాడారు. విశాఖ స్టీల్ ప్లాంట్ల ఇటీవల ప్రమాదం జరిగి పదిమంది కార్మికులు చనిపోవడం జరిగిందని అన్నారు. అదేవిధంగా కొంతమంది క్షతగాత్రులు అవ్వడం జరిగిందని అన్నారు. ప్రమాదాలను నివారించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా వైఫల్యం చెందాయి అని అన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ని ప్రైవేట్ పరం చేయాలని, కార్మిక వర్గాన్ని రోడ్డుని పాలు చేయాలని చూస్తున్నాయని అన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ఆంధ్ర రాష్ట్ర ప్రజల సెంటిమెంటుతో ప్రజల సెంటిమెంటుతో కూడుకుందని అన్నారు. అదేవిధంగా జూలై 3 తేదీన రాష్ట్రవ్యాప్తంగా కలెక్టర్ ల కార్యాలయాల వద్ద విశాఖ స్టీల్ ప్లాంట్ కార్మికులకు సంఘీభావంగా ధర్నా జరుగుతుందని అన్నారు. అదేవిధంగా చనిపోయిన ప్రతి కార్మికుడికి కోటి రూపాయలు ఇవ్వాలని, క్షతగాత్రులకు 50 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ నిరసన కార్యక్రమం జరుగుతుందని వారన్నారు. ఈ కార్యక్రమంలో కార్మిక నాయకులు, కార్మికులు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు.

# ఈవీఎం, వీవీప్యాట్ గోదాముకు పటిష్ట భద్రత

**- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**

ఈవీఎం, వీవీప్యాట్ గోదాముకు పటిష్ట భద్రత కల్పించడం జరిగిందని.. అయినప్పటికీ నిరంతర పర్యవేక్షణతో అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు.భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా సాధారణ నెలవారీ తనిఖీల్లో భాగంగా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి సోమవారం కలెక్టర్ లక్ష్మీశ గొల్లపూడిలోని ఈవీఎం, వీవీప్యాట్ల గోదామును పరిశీలించారు. సీసీ కెమెరాల పనితీరుతో పాటు అగ్నిమాపక విద్యుత్ పరికరాలను పరిశీలించి అనంతరం పర్యవేక్షణ రిజిస్టర్లో సంతకం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ఈసీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా ఈవీఎం, వీవీప్యాట్లను భద్రపరుస్తున్న గోదామును క్షుణ్ణంగా తనిఖీ చేసి ఎప్పటికప్పుడు సమగ్ర నివేదికను అందించడం జరుగుతోందన్నారు. అదేవిధంగా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలోనూ తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గోదాము వద్ద విధులు నిర్వహిస్తున్న భద్రతా సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉంటూ సీసీ కెమెరాల పర్యవేక్షణతో గట్టి నిఘా ఉంచాలని కలెక్టర్ లక్ష్మీశ అధికారులకు సూచించారు.ఈవీఎం, వీవీప్యాట్ల గోదాము తనిఖీలో డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహంతో పాటు ఏదుపాటి రామయ్య (తెదేపా), వై.ఆంజనేయ రెడ్డి (వైఎస్ఆర్‌సీపీ), మురళీకృష్ణ (ఐఎన్‌సీ), జడగం శ్రీనివాసరావు (జనసేన పార్టీ) తదితరులు పాల్గొన్నారు.

## ఎడ్లకు, వ్యవసాయ పనిముట్లకు, నెల తల్లికి పూజ చేసి, విత్తనం గొర్రుపట్టి, ట్రాక్టర్ నడిపిన ఏరువాక పౌర్ణమిలో సందడి చేసిన నంద్యాల డాక్టర్ బైరెడ్డి శబరి.

నేల తల్లికి, ఎడ్లకు, వ్యవసాయ పనిముట్లకు ప్రత్యేక పూజలు చేసి, విత్తనం గొర్రు పట్టి, స్వయంగా ట్రాక్టర్ నడిపి పొలం దున్ని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరి సందడి చేశారు.సోమవారం నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ బైరెడ్డి శబరి, రాష్ట్ర మంత్రి ఎన్ ఎం డి ఫరూక్, పాణ్యం ఎమ్మెల్యే, టీడీపీ జిల్లా అధ్యక్షురాలు గౌరు చరిత, నంద్యాల జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, ఏ డి ఆర్ డాక్టర్. జయలక్ష్మి, నంద్యాల జిల్లా వ్యవసాయశాఖ అధికారి నున్నా. వెంకటేశ్వర్లు తదితరుల పాల్గొన్న ఏరువాక పౌర్ణమి సంబరాల్లో నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి విత్తనం గొర్రు పట్టి, స్వయంగా ట్రాక్టర్ తొలి సందడి చేశారు. ఈ సందర్బంగా ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని మా మంచి ఉమ్మడి ప్రభుత్వం రైతు పక్షపాతి అన్నారు. రైతు సంతోషం, ఆనందంగా ఉంటేనే రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. రైతే రాజు అని, దేశాభివృద్ధిలో రైతు కీలకమని నమ్మిన సీఎం చంద్రబాబు మొదటి ఏడాది అన్నదాత సుఖీభవ, పి ఎం కిసాన్ నిధులు అర్హులైన రైతులకు 20 వేలు జమచేసి, రెండవ ఏడాదికి కూడా ఇటీవలే అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ నిధులు రూ. 7 వేలు పెట్టుబడి నిధులు జమచేయడం సంతోషంగా ఉందని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు.ఏరువాక పౌర్ణమి రైతుకు ఎంతో ముఖ్యమైన రోజు, నేల తల్లికి, కుటుంబ సభ్యులుగా భావించి (ఎడ్లు )పశువులకు, వ్యవసాయ పనిముట్లకు రైతు పూజ చేసి ఖరీఫ్ సీజన్ వ్యవసాయం మొదలు పెట్టడం, భూమిలో విత్తనాలు వేయడం మంచి రోజు, భారతీయ రైతు సాంప్రదాయం అన్నారు. కృష్ణా, తుంగభద్ర నదుల నీటితో రాయలసీమలోని అన్ని చెరువులను నీటితో నింపి, కుప్పం చివరి ప్రాంతంకు సీఎం చంద్రబాబు సాగు నీరు తీసుకెళ్లి చరిత్ర సృష్టించారని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. ఈ ఏడాది కూడా సకాలంలో వర్షాలు పడి రైతు పంట చేతికి వచ్చేలా ఆ దేవుళ్ళ దీవించాలని, రైతు సంతోషం మా ఉమ్మడి ప్రభుత్వ లక్ష్యం అన్నారు. రైతుకు కష్టం రాకుండా చూసుకునే భాద్యత మా మంచి కూటమి ప్రభుత్వందే అని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు.

# ఆర్టీఐ వేదికగా ప్రజా సమస్యలపై ఫిర్యాదుల వెల్లువ

**- మూడు కీలక అంశాలపై జిల్లా కలెక్టర్‌కు పీజీఆర్ఎస్‌లో వినతులు**

**- యునైటెడ్ ఫోరమ్ ఫర్ ఆర్టీఐ క్యాంపెయిన్స్ ఆధ్వర్యంలో సామాజిక కార్యకర్త జంపన శ్రీనివాస గౌడ్ జిల్లా**

**- కలెక్టర్‌కు పీజీఆర్ఎస్‌లో మూడు కీలక ప్రజా సమస్యలపై ఫిర్యాదులు సమర్పించారు.**

**- 34,006 హెక్టార్ల మడ అడవులను కాపాడాలని విజ్ఞప్తి**



:కృష్ణా జిల్లాలోని మడ అడవుల సంరక్షణకు తక్షణ చర్యలు చేపట్టాలని ఆర్టీఐ కార్యకర్తలు కోరారు. మచిలీపట్నం డివిజన్‌లో 10,850 హెక్టార్లు, అవనిగడ్డ డివిజన్‌లో 23,156 హెక్టార్లు కలిపి మొత్తం 34,006 హెక్టార్ల మడ అడవులు ఉన్నాయని పేర్కొన్నారు. కోస్టల్ రెగ్యులేషన్ జోన్ (అఖీజి) నిబంధనలను కచ్చితంగా అమలు చేసి, అక్రమ దారులు, ఆక్రమణలు, క్రిమినల్ కేసులపై చర్యలు తీసుకుని మడ అడవులను పరిరక్షించాలని కలెక్టర్‌ను కోరారు.497 గ్రామ పంచాయితీల్లో అవినీతిపై విచారణకు ఫిర్యాదు :సర్పంచులు, కార్యదర్శులపై చర్యలకు డిమాండ్ :కృష్ణా జిల్లాలోని 497 గ్రామ పంచాయితీల్లో సర్పంచుల పదవీకాలం ముగిసే ముందు డీజిల్, పెట్రోల్ తదితర ఖర్చుల పేరుతో ఎస్టిమేట్లు, ఎం-బుక్ నమోదు, టెండర్లు లేకుండానే లక్షలాది రూపాయల నిధులు డ్రా చేసి అవినీతికి పాల్పడ్డారని ఆరోపిస్తూ ఆర్టీఐ కార్యకర్తలు జిల్లా కలెక్టర్ డి.కె. బాలాజీకి పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు.దుర్వినియోగమైన నిధులను రెవెన్యూ రికవరీ చట్టం?1864 ప్రకారం తిరిగి వసూలు చేయడంతో పాటు, ఉ.నా.ఓబ.ఔనీ.458 (22-09-2009) నిబంధనల మేరకు బాధ్యులైన పంచాయితీ కార్యదర్శులపై శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకుని ప్రభుత్వ సేవల నుంచి తొలగించాలని ఫిర్యాదులో కోరారు.1.47 సెంట్ల కామన్ సైట్ భూమిని రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేయాలి :ఉయ్యూరు మండలం గండిగుంట గ్రామంలోని సర్వే నంబర్లు 218, 219, 228 తదితర పరిధిలో ఉన్న సుమారు 1.47 సెంట్ల కామన్ సైట్ భూమిని ప్రభుత్వ మెమో (ఖీఇఎ.08-22057/11/2024, తేదీ 07-03-2025) ప్రకారం రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేయాలని ఫిర్యాదు చేశారు. ఈ భూమికి సంబంధించిన రికార్డులను సరిచేసి ప్రభుత్వ ఆస్తిగా నమోదు చేయాలని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు.ఈ మూడు అంశాలపై జిల్లా యంత్రాంగం స్పందించి విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని యునైటెడ్ ఫోరమ్ ఫర్ ఆర్టీఐ క్యాంపెయిన్స్ ప్రతినిధులు జంపాన శ్రీనివాస గౌడ్, బొల్లా శివపార్వతి కోరారు

# ఆమె విద్యార్థిని కాదు కలెక్టరమ్మ

**విద్యార్థిగా మారి పాఠాలు విన్న కలెక్టర్**

**విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసిన కలెక్టర్ గరిమ అగ్రవాల్**



ఎల్లారెడ్డిపేట (ప్రశ్న న్యూస్) నిత్యం విధి నిర్వహణలో బిజీ బిజీగా ఉండే జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ విద్యార్థులకు బోధన చేస్తున్న తీరును వారితో కలిసి కూర్చుని పరిశీలిస్తూ, పాఠ్యాంశం విన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం దుమాలలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ (ఈఎంఆర్ఎస్) విద్యాలయంలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఇంటర్ ఫస్ట్ ఇయర్ ఎకనామిక్స్ పాఠ్యాంశం ఉపాధ్యాయుడు బోధిస్తుండగా, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులతో కలిసి బెంచి పై కూర్చున్నారు. పాఠ్యాంశం బోధనను స్వయంగా పరిశీలించారు. పూర్తి అయిన తర్వాత దానిపై విద్యార్థులకు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. అనంతరం డైనింగ్ హాల్ కు వెళ్లి విద్యార్థులు భోజనం చేస్తుండగా ముందుగా మెనూ పరిశీలించి సిద్ధం చేసిన ఆహార పదార్థాలను తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. మెనూ ప్రకారం ప్రతి రోజు భోజనం పెడుతున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని ఆరా తీశారు. ప్రతి విద్యార్థి ప్రణాళిక ప్రకారం చదవాలని, ప్రభుత్వ వసతులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థి. చదువులో రాణించి తాము అనుకున్న లక్ష్యం చేరుకోవాలని ఆకాంక్షించారు. లైబ్రరీ లో పుస్తకాలతోపాటు దిన పత్రికలు చదవాలని తెలిపారు. దీంతో అన్ని విషయాలపై అవగాహన వస్తుందని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ వివరించారు. పరిశీలనలో ప్రిన్సిపాల్ ఫాతిమా, ఎంపీడీఓ సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నాయకులు చెరలో స్మశాన వాటిక

**కాపాడాలి అంటూ ప్రజావాణిలో బిజెపి నేత ఫిర్యాదు**



మేడ్చల్( ప్రశ్న న్యూస్ )మేడ్చల్ కాంగ్రెస్ నాయకుల చరలో స్మశాన వాటిక ఉందని ప్రజావాణిలో బీజేపీ సీనియర్ నాయకులు చెరువుకొమ్ము శ్రీనివాస్ గౌడ్ ఫిర్యాదు చేశారు. మేడ్చల్ డివిజన్ ముకుంద్ సినిమా థియేటర్ వెనకాల, రైల్వే స్టేషన్ దగ్గర లో ఉన్న 1117 సర్వే నెంబర్ లో ఉన్న స్మశాన వాటిక ను ఆక్రమించి జేసీబీ తో చదును చేయడం జరిగింది అని మేడ్చల్ బీజేపీ సీనియర్ నాయకులు చెరువుకొమ్ము శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు. సోమవారం ఉదయం మేడ్చల్ జిహెచ్ఎంసి సర్కిల్ ప్రజావాణి కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ మేడ్చల్ పట్టణంలోని1117 సర్వే నంబర్ లేఔట్ లో స్మశాన వాటిక ఉందని ఆ స్మశాన వాటిక ను కొందరు కాంగ్రెస్ నాయకులు ఆక్రమించారని ఆరోపించారు. స్మశాన వాటిక పక్కనే ఉన్న ప్లాట్ల నెంబర్ తో బై నెంబర్లు వేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని తెలిపారు. రిజిస్ట్రేషన్ పూర్తయిన తర్వాత స్మశాన వాటిక రూపురేఖలు, హద్దులను తొలగించి ప్లాట్ల నెంబర్ల తో హద్దు రాళ్లు ఏర్పాటు చేయడం దారుణంగా ఉందన్నారు. జిహెచ్ఎంసి అధికారులు వెంటనే స్మశాన వాటిక హద్దు లను ఏర్పాటు చేయాలని అలాగే జరిగిన రిజిస్టర్ ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

## సర్ కు విశేష స్పందన

**కాంగ్రెస్ సీనియర్ నేత సాయిపేట శ్రీనివాస్**



మేడ్చల్( ప్రశ్న న్యూస్ ) సర్ కార్యక్రమానికి విషశ స్పందన లభిస్తుందని గుండ్ల పోచంపల్లి డివిజన్ కార్యాలయ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ కౌన్సిలర్, మాజీ జెడ్పిటిసి సాయి పేట శ్రీనివాస్ అన్నారు.గుండ్లపోచంపల్లి డివిజన్ పరిధిలో నిఅంబేద్కర్ జగ్జీవన్ రామ్ కాలనిలో ఎమ్యునరేషన్ ఫారంలను బి ఎల్ ఓ లతో కలిసి ఇంటింటికి తిరుగుతూ ఓటర్లకు ఫారం లను సాయి పేట శ్రీనివాస్ అందజేశారు. సాయిపేట శ్రీనివాస్ తో పాటు మాజీ సర్పంచ్ బండారి నరేందర్, కుండ భానుచందర్, సర్ పైన ఓటర్లకు అవగాహన కల్పిస్తూ తప్పకుండా ఫారం నింపిన తర్వాత బిఎల్ఓ లకు అందించాలని సాయి పేట శ్రీనివాస్ సూచించారు.ఈ కార్యక్రమంలో గుండ్లపోచంపల్లి మాజీ సర్పంచ్ బండారి నరేందర్, డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఎస్సి సెల్ అధ్యక్షులు కుండ భానుచందర్, బుర్కాగాళ్ల శ్రీనివాస్, బి ఎల్ ఓ కిరణ్, ఎక్కడిగాళ్ల కృష్ణ,కొమ్ము కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# చట్టాన్నే ధిక్కరించిన నిర్మాణం

- **సెక్షన్ 461-ఎ కింద సీజ్ చేసిన భవనంలోనే కొనసాగుతున్న పనులు**
- **సీజ్ ధిక్కరణపై క్రిమినల్ కేసు నమోదైనా ఆగని అక్రమ నిర్మాణం**
- **ప్రజావాణి వరకు ఫిర్యాదులు.. స్పందించని యంత్రాంగం**
- **'రెండు రోజుల్లో చర్యలు' అన్న అధికారుల హామీ బుట్టదాఖలు**





శేర్లింగంపల్లి (ప్రశ్న న్యూస్)జీహెచ్ఎంసీ చట్టం ప్రకారం సీజ్ చేసిన అక్రమ భవనంలోనే నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. సీజ్ ధిక్కరణపై క్రిమినల్ కేసు నమోదైనా పనులు ఆగకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజావాణి వరకు ఫిర్యాదులు వెళ్లినా టౌన్ ప్లానింగ్ అధికారులు స్పందించలేదన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల బాధ్యతలు చేపట్టిన డిప్యూటీ కమిషనర్ రెండు రోజుల్లో చర్యలు తీసుకుంటామని ప్రకటించిన, వారం రోజులు గడిచినా పరిస్థితిలో ఏమాత్రం మార్పు కనిపించకపోవడం గంగారం ప్రాంతంలో తీవ్ర చర్చనీయాంశమైంది.

మియాపూర్ సర్కిల్ పరిధిలోని గంగారం ప్రాంతంలో సుమారు 730 గజాల విస్తీర్ణంలో స్టిల్ట్‌తో పాటు ఐదు అంతస్తుల భవనం నిర్మిస్తున్నారు. నిర్మాణంలో నిబంధనల ఉల్లంఘనలు గుర్తించిన అప్పటి జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు 2025 సెప్టెంబర్ 26న జీహెచ్ఎంసీ చట్టంలోని సెక్షన్ 461-ఎ ప్రకారం భవనాన్ని సీజ్ చేసి పనులు నిలిపివేయాలని ఆదేశించారు. అయితే ఫిర్యాదుదారుల ఆరోపణల ప్రకారం కొద్ది గంటల్లోనే సీజ్ తొలగించి నిర్మాణాన్ని తిరిగి ప్రారంభించారు. దీంతో సంబంధిత బిల్డర్‌పై చందానగర్ పోలీస్ స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదైంది. అయినప్పటికీ నిర్మాణం కొనసాగి ప్రస్తుతం గృహప్రవేశానికి సిద్ధమైనట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ భవనానికి చేరుకునే మార్గం కేవలం ఆరు నుంచి ఎనిమిది అడుగుల వెడల్పున్న ఇరుకు దారి మాత్రమేనని స్థానికులు పేర్కొంటున్నారు. దాదాపు 50 కుటుంబాలు నివసించే ఈ భవనానికి అత్యవసర పరిస్థితుల్లో అగ్నిమాపక వాహనాలు, అంబులెన్సులు చేరుకోవడం కూడా కష్టసాధ్యమేనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిర్మాణ అనుమతులతో పాటు అగ్నిమాపక, భద్రతా ప్రమాణాల అమలుపై కమిషనర్ సమగ్ర విచారణ జరపాలని కోరుతున్నారు. అక్రమ నిర్మాణం కొనసాగుతోందంటూ స్థానికులు అసిస్టెంట్ సిటీ ప్లానర్, డిప్యూటీ కమిషనర్, జోనల్ కమిషనర్, మున్సిపల్ కమిషనర్‌కు పలుమార్లు ఫిర్యాదులు చేసినట్లు పేర్కొంటున్నారు.

అధికారుల నుండి ఎలాంటి స్పందన లేకపోవడంతో రాష్ట్ర ప్రజావాణిని ఆశ్రయించినప్పటికీ పరిస్థితిలో మార్పు కనిపించలేదని వాపోతున్నారు. ఇటీవల ఈ అంశంపై స్పందించిన మియాపూర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్, గతంలో భవనాన్ని సీజ్ చేసిన విషయం తమ దృష్టిలో ఉందని, విచారణ పూర్తి చేసి రెండు రోజుల్లో నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. అయితే ఆ హామీ ఇచ్చి వారం రోజులు గడిచినా క్షేత్రస్థాయిలో ఎలాంటి చర్యలు కనిపించలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఒకసారి సీజ్ చేసిన భవనంలో మళ్లీ నిర్మాణం ఎలా కొనసాగింది.? సీజ్ ధిక్కరణ పై క్రిమినల్ కేసు నమోదైన తర్వాత కూడా అధికారులు ఎందుకు అడ్డుకోలేకపోయారు.? కేవలం ఆరు నుంచి ఎనిమిది అడుగుల వెడల్పున్న ఇరుకు దారిలో నిర్మించిన ఈ బహుళ అంతస్తుల భవనానికి భద్రతా ప్రమాణాలు ఎలా వర్తింపజేశారు.? ప్రజావాణి వరకు ఫిర్యాదులు వెళ్లినా అధికారుల చర్యలు ఎందుకు కనిపించలేదు.? అనే ప్రశ్నలు స్థానికుల నుంచి జోరుగా వినిపిస్తున్నాయి.

## కన్నాయిగూడెం మండల సర్పంచుల ఫోరం

# అధ్యక్షురాలిగా పీరీల స్వప్న ఏకగ్రీవ ఎన్నిక.

- **గ్రామ అభివృద్ధే లక్ష్యంగా కృషి చేస్తాం: నూతన అధ్యక్షురాలు పీరిల స్వప్న**
- **సర్పంచుల ఫోరం పగ్గాలు పీరీలా స్వప్న చేతిలోకి, ఏకగ్రీవంగా ఎన్నిక.**
- **వాడవాడలా అభివృద్ధి సర్పంచులకు పీర్ల స్వప్న పిలుపు.**
- **కన్నాయిగూడెం సర్పంచుల ఫోరంలో కొత్త శకం ప్రారంభం.**



కన్నాయిగూడెం (ప్రశ్న న్యూస్) కన్నాయిగూడెం మండల సర్పంచుల ఫోరం అధ్యక్ష పదవికి జరిగిన ఎన్నికల్లో పీరిల స్వప్న ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండలంలోని సర్పంచులు అందరూ ఏకమై ఆమె పేరును ప్రతిపాదించడంతో ఎన్నిక ఏకగ్రీవంగా పూర్తయింది.ఎన్నిక అనంతరం మాట్లాడిన నూతన అధ్యక్షురాలు పీరిల స్వప్న, మండలంలోని ప్రతి గ్రామ పంచాయతీ వాడవాడలా అభివృద్ధి చెందేలా అందరం సమిష్టిగా కృషి చేయాలని సర్పంచులకు పిలుపునిచ్చారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన, పారిశుద్ధ్యం, తాగునీరు వంటి అంశాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఆమె అన్నారు. సర్పంచుల ఫోరం వర్కింగ్ ప్రెసిడెంట్ పిరిల సురేష్ మాట్లాడుతూ, గ్రామ అభివృద్ధి అనేది ఒక్క అధ్యక్షురాలి బాధ్యత కాదు. ప్రతి సర్పంచ్ తమ గ్రామాన్ని ఒక కుటుంబంగా భావించి పని చేయాలి. యువతకు ఉపాధి అవకాశాలు, వ్యవసాయానికి ఆధునిక సహాయం, డిజిటల్ లైబ్రరీలు, క్రీడా మైదానాల అభివృద్ధి మన ప్రధాన ఎజెండా. ప్రతి గ్రామంలో పచ్చదనం పెంచి, చెత్త రహిత గ్రామాలుగా తీర్చిద్దడం కోసం ఫోరం తరపున ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. అధ్యక్షురాలు పీర్ల స్వప్న గారి నాయకత్వంలో మన మండలంలోని అన్ని గ్రామాలు అభివృద్ధిలో ముందు వరుసలో నిలిచేలా అందరం కలిసి పని చేద్దాం" అని పిలుపునిచ్చారు. ప్రభుత్వ పథకాలు ప్రతి ఇంటికీ చేరేలా చర్యలు తీసుకుంటామని, అధికారులతో సమన్వయం చేసుకుని అభివృద్ధి పనులను వేగవంతం చేస్తామని పీర్ల స్వప్న స్పష్టం చేశారు. సర్పంచులందరి సహకారంతో మండలాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ మండలంగా తీర్చిద్దుతామని ఆమె విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల ఫోరం ఉపాధ్యక్షులు తిప్పనపల్లి లక్ష్మయ్య. ప్రధాన కార్యదర్శి అంబాల సౌజన్యం. కోశాధికారి అల్లెం అనిత. వర్కింగ్ ప్రెసిడెంట్ పిరిల సురేష్. కార్యవర్గ సభ్యులు జాడి రాంబాబు. చింత చంద్రయ్య. కోరం నరసయ్య. పొడెం నర్సింగరావు. ఆగ్గు రోజా. కుర్సం రమాదేవి. పాల్గొన్నారు.

## అహ్మదిపూర్ ఎక్స్‌రోడ్ నుంచి హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్ బస్సు ప్రారంభం




గజ్వేల్ (ప్రశ్న న్యూస్) సిద్దిపేట నుంచి హైదరాబాద్‌కు వెళ్లే ఎక్స్‌ప్రెస్ బస్సు సేవను అహ్మదిపూర్ ఎక్స్‌రోడ్ నుంచి సోమవారం నుంచి ప్రారంభించినట్లు అహ్మదిపూర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలిపారు.ఈ నెల 25న మంత్రి వివేక్‌కు, సంగారెడ్డి ఆర్ఎన్‌వోకు అహ్మదిపూర్ ఎక్స్‌రోడ్ మీదుగా హైదరాబాద్‌కు ఎక్స్‌ప్రెస్ బస్సులు నడపాలని వినతిపత్రం అందజేసిన నేపథ్యంలో సోమవారం నుంచి బస్సు సౌకర్యం కల్పించినట్లు వెల్లడించారు.ఈ సందర్భంగా ఆత్మ కమిటీ డైరెక్టర్ గజ్వేల్ రామచంద్రం రెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు శనిగరి మల్లేశం మాట్లాడుతూ, అహ్మదిపూర్ గ్రామం నుంచి ప్రతిరోజూ 50 నుంచి 80 మంది విద్యార్థులు గజ్వేల్, సిద్దిపేట, హైదరాబాద్ ప్రాంతాలకు చదువులు, ఉద్యోగాల కోసం ప్రయాణిస్తుంటారని తెలిపారు. బస్సు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు.గతంలో ఉదయం, సాయంత్రం బస్సులు నడిచేవని, ప్రస్తుతం ఆ సేవలు నిలిచిపోవడంతో గ్రామ ప్రజలు, విద్యార్థులు తమ దృష్టికి తీసుకువచ్చారని పేర్కొన్నారు. ఈ విషయాన్ని మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, ఆయన మంత్రి వివేక్‌తో మాట్లాడి సమస్య పరిష్కారానికి చొరవ చూపారని, ఫలితంగా సోమవారం నుంచి ఎక్స్‌ప్రెస్ బస్సు సేవలు పునఃప్రారంభమయ్యాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు అందోలు నర్సింలు, పాల రామగౌడ్, బొర్రణ బాల్‌రాజు గౌడ్, ఏ. రామచంద్రం, జి. నరేందర్ రెడ్డి, బాలకృష్ణారెడ్డి, బోయిని రామచంద్రం, శ్రీనివాస్ రెడ్డి, సీహెచ్ రాజిరెడ్డి, జి. నరసింహారెడ్డి, వెంకట్రాం రెడ్డి, శనిగరి రాజు, కమ్మరి నాగార్జున్, అత్తెల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## అర్ధరాత్రి ఆస్పత్రిలో మహిళ హల్ చల్..

ఎల్బీ నగర్‌లోని హాస్పిటల్‌లో అర్ధరాత్రి ఓ మహిళ హల్ చల్ చేసింది. లలిత కరీర అనే మహిళ కడుపునొప్పి ఉందంటూ ఎల్బీ నగర్ శ్రేష్ఠ ఆరెంజ్ హాస్పిటల్‌లోని అత్యవసర విభాగంలో చేరింది. ప్రాథమిక చికిత్సనందించిన డాక్టర్లు ఆమెకు పరీక్షలు నిర్వహించి ఎలాంటి అనారోగ్య సమస్య లేదని తెలియజేశారు. దీంతో లలిత కరీర డాక్టర్లపై ఆగ్రహంతో ఊగిపోతూ దూషిస్తూ వారిపై దాడికి పాల్పడింది. దాడి అనంతరం లలిత కరీర ఖా 08 ఎ+ 9824 నంబర్ కారును స్వయంగా నడుపుకుంటూ వనస్థలిపురంలోని సహారా హాస్పిటల్‌కు వెళ్లింది. ఈ నేపథ్యంలో ఆస్పత్రి సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు ఆధారంగా ఎల్బీ నగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఇంతకీ ఆ మహిళ డాక్టర్లు, ఆస్పత్రి సిబ్బంది పట్ల అలా ఎందుకు ప్రవర్తించిదనేది తెలియాల్సి ఉంది.

## జగదేవపూర్ విద్యుత్ ఏఈపై చర్యలు తీసుకోవాలి

**తిమ్మాపూర్ సర్పంచ్ పోసాన్‌పల్లి రాజు**




గజ్వేల్( ప్రశ్న న్యూస్ ) జగదేవపూర్ మండలంలో ప్రజా సమస్యలను పరిష్కరించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న విద్యుత్ శాఖ ఏఈపై చర్యలు తీసుకోవాలని, కలెక్టర్ లాగిన్‌లో పెండింగ్‌లో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తులకు వెంటనే ప్రొసీడింగ్స్ జారీ చేయాలని తిమ్మాపూర్ సర్పంచ్ పోసాన్‌పల్లి రాజు డిమాండ్ చేశారు.సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో వట్టిపల్లి ఉపసర్పంచ్ బోనకొల్లూరు నాగరాజు, వార్డు సభ్యుడు కొలనుపాక రాములు తదితరులతో కలిసి కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో అర్హులైన పలువురు పేదల పేర్లు ఎల్-3 జాబితాలోకి వెళ్లడంతో ఇళ్లు మంజూరు కాలేదన్నారు. ఎంపీడీవో, జిల్లా కలెక్టర్‌కు పలుమార్లు దరఖాస్తులు ఇచ్చినా, జస్టిఫికేషన్ నివేదికలు కలెక్టర్ లాగిన్‌లో పెండింగ్‌లోనే ఉండిపోయాయని, వెంటనే ప్రొసీడింగ్స్ జారీ చేసి అర్హులకు న్యాయం చేయాలని కోరారు.అలాగే జగదేవపూర్ విద్యుత్ శాఖ ఏఈ గ్రామాల సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. తిమ్మాపూర్ గ్రామంలో ఇళ్లపై నుంచి త్రీఫేజ్ విద్యుత్ లైన్లు వెళ్లడం వల్ల ప్రమాదకర పరిస్థితులు ఏర్పడ్డాయని, రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభం తీగల ఆధారంగా మాత్రమే నిలిచి ఉండటంతో ఎప్పుడైనా ప్రమాదం సంభవించే అవకాశం ఉందన్నారు. ఈ విషయాన్ని మూడు నెలలుగా అధికారుల దృష్టికి తీసుకెళ్లినా చర్యలు తీసుకోలేదని విమర్శించారు. వట్టిపల్లి గ్రామంలో కూడా ఇళ్లపై ఉన్న సింగిల్ ఫేజ్ విద్యుత్ లైన్లను తొలగించాలని పలుమార్లు కోరినా స్పందన లేదని తెలిపారు. గ్రామాల్లో పర్యటించి సమస్యలను గుర్తించడంలో ఏఈ పూర్తిగా విఫలమయ్యారని, ఆయనను మండలం నుంచి బదిలీ చేయాలని డిమాండ్ చేశారు.ఈ సమస్యలపై జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి, పెండింగ్‌లో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తులను పరిష్కరించడంతో పాటు నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో దుబాసి సుధాకర్, కె. సురేష్, పైసా స్వామి, గుండ్రు స్వామి తదితరులు పాల్గొన్నారు.

## 'నో' చెప్పడం నేర్చుకోండి



'ప్రతిభావంతులైన నటీనటులు రొటీన్ కథలకు 'నో' చెప్పడం నేర్చుకోవాలి' అంటున్నారు బాలీవుడ్ భామ కంగనా రనౌత్. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఆసక్తికరమైన విషయాలను ఆమె వెల్లడించారు. 'నా యాటిట్యూడ్ కొందరికి ఇబ్బందిగా ఉంటుంది. నిర్మొహమాటంగా మాట్లాడటం. నచ్చని దాన్ని 'నచ్చలేదు' అని ముఖం మీదే చెప్పడం చాలామందికి నచ్చదు. కానీ నా ఉద్దేశ్యంలో 'నో' చెప్పడం చేతకాని వాళ్లు జీవితాన్ని గెలవలేరు. ఈ కారణంగా మనం టార్గెట్ అయినా.. దక్కాల్సిన అవకాశాలు మనకు దక్కకపోయినా.. చివరికి మాత్రం నిజాయితీనే గెలుస్తుంది. సంఖ్య అనేది ఎప్పటికీ ముఖ్యం కాదు. క్వాలిటీనే ముఖ్యం. మనం చేసిన పాత్రలు కొన్నేళ్లపాటు గుర్తుంటే, మనం ఆటోమేటిగ్గా గుర్తుంటాం. నచ్చని కథల్ని దూరం పెట్టాను కాబట్టే, నేను రెగ్యులర్ హీరోయిన్ల లిస్ట్‌లో లేను. అందుకు బాధ లేదు. నాకంటూ జనాల్లో ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. అది చాలు' అన్నారు కంగనా. ప్రస్తుతం ఆమె 'క్వీన్ 2'లో నటిస్తున్న విషయం తెలిసిందే.

## భాగ్యనగరంలో చివరి షెడ్యూల్



మెగా హీరో సాయిదుర్గతేజ్ నటిస్తున్న ప్రతిష్టాత్మక పానిండియా ప్రాజెక్ట్(సంబరాల ఏటిగట్టు). రోహిత్ కేపీ దర్శకుడు. కె.నిరంజన్‌రెడ్డి, చైతన్యరెడ్డి నిర్మాతలు. ఈ సినిమా నిర్మాణం చివరి దశకు చేరింది. ఈ క్రమంలో కీలక షెడ్యూల్ ఆదివారం నుంచి హైదరాబాద్‌లో మొదలైంది. అద్భుతమైన యాక్షన్ ప్యాక్డ్ సన్నివేశాలు తీసేందుకు ప్రత్యేకంగా ఓ భారీ సెట్‌ని నిర్మించారు. ఈ యాక్షన్ సీక్వెన్స్‌తో పాటు ప్రధాన తారాగణం అంతా పాల్గొనే కీలక ఘట్టాలను ఈ షెడ్యూల్‌లో చిత్రీకరిస్తారు. సాయిదుర్గతేజ్ కెరీర్‌లోనే అత్యంత శక్తివంతమైన, ఇంటెన్స్ పాత్రలో నటిస్తున్న ఈ చిత్రం ప్రేక్షకులకు ఓ కొత్త సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌ని ఇవ్వనున్నదని మేకర్స్ చెబుతున్నారు. పవర్‌ఫుల్ స్క్రీన్‌ప్లే, ఉత్కంఠభరితమైన విజువల్స్, హై-ఆక్టేన్ సన్నివేశాల మేళవింపుతో గ్రాండ్ యాక్షన్ డ్రామాగా దర్శకుడు రోహిత్ కేపీ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారని, ఈ షెడ్యూల్ అనంతరం పోస్ట్ ప్రొడక్షన్ పనులు మొదలుపెడతామని, త్వరలోనే విడుదల తేదీని ప్రకటిస్తామని మేకర్స్ తెలిపారు. ఐశ్వర్యలక్ష్మి కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో జగపతిబాబు, సాయికుమార్, శ్రీకాంత్, అనన్య నాగళ్ల ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: వెట్రి పళనిసామి, సంగీతం: బి.అజనీష్ లోక్‌నాథ్, నిర్మాణం: ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్స్.

## అదిరిపోయే రేంజ్‌లో ఆరంభం



దేశవ్యాప్తంగా రూపొందుతున్న ప్రతిష్టాత్మక పానిండియా చిత్రాల్లో ఎన్టీఆర్ 'డ్రాగన్' ఒకటి. 'కేజీఎఫ్' ఫేం ప్రశాంత్‌నీల్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్‌పై ఇండియా లెవల్లో భారీ అంచనాలే ఉన్నాయి. ఈ సినిమా షూటింగ్ 50శాతం పూర్తయింది. ప్రస్తుతం ఎన్టీఆర్ ఎంట్రీ సీక్వెన్స్ కోసం భారీ సెట్ల నిర్మాణం జరుగుతున్నదని సమాచారం. ఈ సీక్వెన్స్‌లో తారక్ గెటప్ కొత్తగా ఉంటుందట.దఎన్టీఆర్ అభిమానులను దృష్టిలో పెట్టుకొని ప్రత్యేకంగా ఈ లుక్‌ని ప్రశాంత్‌నీల్ డిజైన్ చేశారట. ఈ సీక్వెన్స్‌లో ఎన్టీఆర్‌తో పాటు నలభైమంది ఫైటర్స్ కూడా భాగం కానున్నారట. ఈ సీక్వెన్స్‌తో షెడ్యూల్ పూర్తవుతుందని, ఓ పాట షూట్‌తో నెక్ట్స్ షెడ్యూల్ మొదలవుతుందని ఇన్‌సైడ్ టాక్. సాధారణంగా ప్రశాంత్‌నీల్ సినిమా ఫ్రేమ్స్ అన్నీ బ్లాక్ అండ్ గ్రే షేడ్స్‌లో ఉంటాయి. కానీ ఈ సినిమాను మాత్రం ఆయన కలర్‌ఫుల్‌గా తెరకెక్కిస్తున్నారట. రుక్మిణీ వసంత్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీమేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ కలిసి నిర్మిస్తున్న విషయం తెలిసిందే. రవి బస్రూర్ ఈ చిత్రానికి సంగీత దర్శకుడు.

## శ్రీహరి తనయుడి 'స్టూడెంట్' టీజర్..

### క్యాంపస్ పాలిటిక్స్‌తో అదరగొట్టిన మేఘాంశ్




దివంగత రియల్ స్టార్ శ్రీహరి వారసుడిగా సినీ రంగంలో నిలదొక్కుకునేందుకు ప్రయత్నిస్తున్న యువ హీరో మేఘాంశ్ శ్రీహరి, తన కొత్త చిత్రం 'స్టూడెంట్' (చూ్బఎవత్)తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. క్యాంపస్ రాజకీయాల నేపథ్యంలో సాగే ఈ హై-వోల్టేజ్ యాక్షన్ డ్రామా టీజర్‌ను చిత్రబృందం తాజాగా విడుదల చేసింది. పవర్‌ఫుల్ యాక్షన్ సన్నివేశాలతో నిండిన ఈ టీజర్, సినిమాపై అంచనాలను ఒక్కసారిగా పెంచింది.ఈ చిత్రంలో మేఘాంశ్ శ్రీహరి ఓ విద్యార్థి నాయకుడిగా ఇంటెన్స్ మాస్ లుక్‌లో కనిపించి ఆకట్టుకున్నాడు. ఆయన సరసన విజేత పరీక్ కథానాయికగా నటిస్తోంది. బాలు తత్వమసి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని జోవికా సినిమాస్, చెరిష్ మీడియా వర్క్స్ పతాకాలపై బెల్లం సిద్ధారెడ్డి ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. విద్యార్థి సంఘాల మధ్య ఘర్షణలు, రాజకీయాలతో పాటు చిత్రంలో ఓ అందమైన ప్రేమకథ కూడా ఉంటుందని చిత్ర యూనిట్ తెలిపింది.ప్రేమ్ చంద్ కంచర్ల ఈ చిత్రానికి సంగీతం అందిస్తుండగా, శ్రీనివాస్ బెజుగం సినిమాటోగ్రాఫర్‌గా పనిచేస్తున్నారు. టాలీవుడ్‌లో తనదైన గుర్తింపు కోసం ఎదురుచూస్తున్న మేఘాంశ్ కెరీర్‌లో ఈ చిత్రం ఒక మైలురాయిగా నిలుస్తుందని చిత్రబృందం గట్టి నమ్మకంతో ఉంది.

# 'లింగం' సిరీస్ రివ్యూ!




తమిళంలో తాజాగా రూపొందిన ఒక క్రైమ్ థ్రిల్లర్ ఇప్పుడు ఓటీటీ తెరపైకి వచ్చింది. మాఫియా నేపథ్యంలో సాగే ఆ సిరీస్ పేరే 'లింగం'. కథిర్ ప్రధానమైన పాత్రను పోషించిన ఈ సిరీస్ కి, లక్ష్మీ శరవణ కుమార్ దర్శకత్వం వహించాడు. 8 ఎపిసోడ్స్ గా నిర్మితమైన ఈ సిరీస్, ఈ నెల 26వ తేదీ నుంచి స్ట్రీమింగ్ అవుతోంది. 'జియో హాట్ స్టార్' లో తమిళంతో పాటు ఇతర భాషల్లోను ఈ సిరీస్ అందుబాటులోకి వచ్చింది.('కన్యాకుమారి'లో ఫిషింగ్ హార్బర్ ల చుట్టూ రాజకీయాలు నడుస్తూ ఉంటాయి. 'కడప్పురం' పరిధిలో చెల్ల పాండియన్, 'నాగర్ కోయిల్' పరిధిలో సామియప్పన్ చక్రం తిప్పుతుంటారు. ఒకరి ప్రాంతంపై ఒకరు పట్టు సాధించడం కోసం .. ఒకరి ఏరియాలో ఒకరు అక్రమ వ్యాపారాలు చేయడం కోసం ప్రయత్నిస్తూ ఉంటారు. ఈ నేపథ్యంలో తరచూ ఇద్దరి మధ్య గొడవలు జరుగుతూ ఉంటాయి. ఇరువైపులా అనుచరులు శవాలుగా మారుతూ ఉంటారు. అదే ప్రాంతంలో ముత్తులింగం (కథిర్) తన తల్లితో కలిసి నివసిస్తూ ఉంటాడు. పోలీస్ ఆఫీసర్ కావాలనేది ఆయన ఉద్దేశం. స్పోర్ట్స్ కోటాలోనైనా జాబ్ కొట్టాలనే ఉద్దేశంతో, 'కబడ్డీ' ఆడుతూ ఉంటాడు. లింగంతో పోటీగా కబడ్డీ ఎవరూ ఆడలేరనే ఒక టాక్ ఆ ప్రాంతంలో వినిపిస్తూ ఉంటుంది. అతని ఆట తీరు .. నలుగురికీ సాయం చేసే మంచి మనసు చూసి, 'మలార్' (దివ్యభారతి) మనసు పారేసుకుంటుంది. వాళ్లిద్దరూ ప్రేమించుకుంటూ ఉంటారు.ఆ ఊర్లో ప్రతి ఏడాది జాతర సందర్భంలో కబడ్డీ పోటీలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంటుంది. ఆ సమయంలో ముఠా తగాదాలు జరగడం .. అనుచరులు చనిపోతుండటం జరుగుతుంటుంది. ఆ ఏడాది 'గుణశీలన్' అనే రౌడీని 'మార్టిన్' అనే రౌడీ హత్య చేస్తాడు. అయితే సరిగ్గా ఆ ప్రదేశంలో ముత్తులింగం ఉన్న కారణంగా, అతనే గుణశీలన్ ను హత్య చేసి ఉంటాడని అంతా భావిస్తారు. ఫలితంగా అతను కటకటాల పాలవుతాడు.అయితే 'చెల్లదురై' . 'తిరు' కారణంగా జైలు నుంచి బెయిల్ పై బయటికి వచ్చిన ముత్తులింగం, చెల్ల పాండియన్ దగ్గర ప్రధానమైన అనుచరుడిగా చేరతాడు. అటు పోలీసుల బారి నుంచి .. ఇటు గుణశీలన్ అనుచరుల నుంచి తప్పించుకోవడానికి అంతకు మించిన మార్గం లేదని అతను భావిస్తాడు. చెల్ల పాండియన్ కారణంగా ముత్తులింగం .. అతని వలన చెల్ల పాండియన్ ఎదుగుతూ ఉంటారు. దాంతో వాళ్లద్దరినీ అంతం చేస్తే, తన ఆస్తిలో సగం వాటాను ఇస్తానని సామియప్పన్ ప్రకటిస్తాడు. అప్పుడు ఏం జరుగుతుంది? ముత్తులింగం జీవితం ఎలాంటి మలుపు తిరుగుతుంది? అనేది కథ. 1980 - 90ల మధ్య కాలంలో జరిగే కథ ఇది. రాజకీయాలు .. రౌడీయిజం .. ముఠా తగాదాల చుట్టూ తిరిగే కథ ఇది. హార్బర్ పై ఆధారపడినవారి జీవితాలతో కొంతమంది అక్రమార్కులు ఎలా ఆడుకుంటారనే అంశం ఇందులో మనకి ప్రధానంగా కనిపిస్తుంది. పోలీస్ ఆఫీసర్ కావాలనుకున్న ఒక యువకుడిని ఎలాంటి పరిస్థితులు నేరస్థుడిగా మార్చాయి. తాను తీసుకున్న నిర్ణయాలు అతని జీవితాన్ని ఎలా ప్రభావితం చేశాయి? అనే ఆసక్తికరమైన అంశాల చుట్టూ ఈ కథ తిరుగుతుంది. ఈ కథలో ఒక వైపున రాజకీయ నాయకులు .. వాళ్ల ప్రధానమైన అనుచరులు .. మరో వైపున పోలీస్ అధికారులు కనిపిస్తారు. ఈ మధ్యలోనే లింగం - మలార్ తో పాటు, తిరు - పద్మ లవ్ స్టోరీలు నడుస్తూ ఉంటాయి. అప్పుడప్పుడు ఈ ట్రాక్ ఉపశమనాన్ని కలిగిస్తూ ఉంటుంది. ముత్తు లింగం వైపు నుంచి మదర్ సెంటిమెంట్ .. లాయర్ చెల్లా దురై చెల్లెలు సత్య వైపు నుంచి చెల్లెలి సెంటిమెంట్ .. మలార్ వైపు నుంచి ఎమోషన్స్ తో కూడిన లవ్ అక్కడక్కడా టచ్ అవుతుంది. ప్రధానమైన పాత్రలను పోషించిన వాళ్లంతా తమ పాత్రలకి న్యాయం చేశారు. దినేశ్ కుమార్ ఫొటోగ్రఫీ .. నివాస్ కె ప్రసన్న నేపథ్య సంగీతం .. గణేశ్ శివ ఎడిటింగ్ ఫరవాలేదు. ఈ సీజన్ లో హీరో తనకి శత్రువులుగా భావించినవారి తలలను తీసేస్తూ వెళతాడు. అయితే ఆ శత్రువులకు సంబంధించిన వారసులు ప్రతీకారంతో సీజన్ 2 కోసం రెడీ అవుతుండటం మనకి కనిపిస్తుంది.పోలీస్ ఆఫీసర్ కావాలని కలలుగన్న ఒక యువకుడు, తనకి తెలియకుండానే నేర సామ్రాజ్యం దిశగా అడుగులు వేయడం .. లోకల్ డాన్ గా ఎదగడమనే ఈ సిరీస్ కథ నిజానికి చాలా పాతది. కథాకథనాల పరంగా ఎక్కడా కొత్తదనం కోసం ట్రై చేయని సిరీస్ ఇది. 1980లలో ఈ కథ నడుస్తుంది. అప్పట్లోనే ఇలాంటి కథలు చాలా వచ్చాయి.

కాబట్టి ఇప్పుడు కొత్తగా చెప్పింది లేదు .. చూపించింది లేదు. ఊహించని ట్విస్టులు లేకపోవడం మరొక వెలితి అనే చెప్పాలి. ఈ జోనర్ కి తగినట్టుగానే హింస - రక్తపాతం కనిపిస్తాయి. లవ్ .. ఎమోషన్స్ వైపు నుంచి కూడా పెద్దగా ప్రభావితం చేయలేకపోయిన సిరీస్ గానే చెప్పుకోవలసి ఉంటుంది.

# హృద్యమైన ప్రేమకథ



'కోర్ట్' ఫేమ్ శ్రీదేవి, ఏగన్, ఫెమినా జార్జ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తమిళ చిత్రం 'హైకూ'. యువరాజ్ చిన్నసామి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ పూర్తిచేసుకుంది. కాలేజీ నేపథ్యంలో హృదయాన్ని కదిలించే భావోద్వేగాలతో సాగే చిత్రమిదని, యువతతో పాటు కుటుంబ ప్రేక్షకులకు కూడా నచ్చుతుందని దర్శకుడు తెలిపారు. నేటి యువత మనోభావాలకు అద్దంపట్టే చిత్రమిదని, కథలోని కొత్తదనం ప్రతి ఒక్కరిని ఆకట్టుకుంటుందని నిర్మాతలు డి.అరుళానందు, మాథేవో అరుళానందు తెలిపారు. అదిర్చి అరుణ్, మైమ్ గోపి, ఇందుమతి, జెన్సన్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: ప్రియేష్ గురుస్వామి, సంగీతం: సిద్ధుకుమార్, దర్శకత్వం: యువరాజ్ చిన్నసామి.

# దేశభక్తి నేపథ్యంలో



కొనంకి కార్తీక్ హీరోగా నటిస్తున్న యాక్షన్ థ్రిల్లర్ 'సోల్జర్'. '24ఐ7 ఆన్ డ్యూటీ' అనేది ఉపశీర్షిక. శ్రద్ధ ఖత్రి దర్శకత్వంలో కేవీ నాయుడు నిర్మిస్తున్న ఈ చిత్రం ప్రస్తుతం నిర్మాణ దశలో ఉన్నది. తాజాగా ఈ సినిమా ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. శక్తివంతమైన సైనికుడిగా కనిపిస్తున్న కొనంకి కార్తీక్‌ని ఈ పోస్టర్‌లో చూడొచ్చు. పోస్టర్‌లో కనిపిస్తున్న యుద్ధవాతావరణం, పోరాట ఛాయలు, రెపరెపలాడుతున్న త్రివర్ణ పతాకం సినిమాపై అంచనాలు పెంచుతున్నాయి. దేశ భద్రతకోసం అహర్నిశలు శ్రమిస్తున్న భారత సైనికులకు ఈ చిత్రం నివాళిగా నిలుస్తుందని, ఆద్యంతం దేశభక్తి నేపథ్యంలోనే ఈ సినిమా సాగుతుందని మేకర్స్ చెబుతున్నారు. ప్రియాంక వర్మ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: సందీప్ బద్దుల, నిర్మాణం: కొనంకి ఎంటర్‌టైన్మెంట్స్.

## ఉపాధి హామీ పథకంతో రూ.25 లక్షల

# అభివృద్ధి పనులకు నాంది

- ప్రజలకు మౌలిక సౌకర్యాలు అందించడమే లక్ష్యం
- స్తంభంపల్లి గ్రామ సర్పంచ్ : బొంగాని అశోక్ గౌడ్
- చంద్రగిరిపల్లిలో రూ.25 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలం, స్తంభంపల్లి అనుబంధ గ్రామమైన చంద్రగిరిపల్లిలో రూ.25 లక్షల అంచనా వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను గ్రామ సర్పంచ్ బొంగాని అశోక్ గౌడ్ సోమవారం ప్రారంభించారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద స్తంభంపల్లి గ్రామం నుంచి వేములవాడకు వెళ్లే ప్రధాన రహదారి వద్ద నుంచి చంద్రగిరిపల్లి వరకు సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టడంతో గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ బొంగాని అశోక్ గౌడ్ మాట్లాడుతూ, "గ్రామ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడమే గ్రామ పంచాయతీ లక్ష్యం. ఈ సీసీ రోడ్డు పూర్తయితే వర్షాకాలంలో బురద సమస్య తొలగి, ప్రజలు సులభంగా రాకపోకలు సాగించగలుగుతారు. గ్రామ అభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న నిధులను పూర్తిస్థాయిలో వినియోగిస్తూ మరిన్ని అభివృద్ధి పనులు చేపడతాం" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బీరవెల్లి వేంకటేశ్వరరావు, మాజీ ఎంపీటీసీ అక్కెనపల్లి ఉపేందర్, ఉప సర్పంచ్ చంద్రగిరి అశోక్, వార్డు సభ్యుడు చంద్రగిరి వెంకటేష్, అక్కెనపల్లి మధుకర్, వివిధ సంఘాల నాయకులు గంగాధర వెంకటరమణ, చిలుముల రమేష్, ఎర్ర గంగయ్య, కొట్టెపల్లి అనిల్, రాచర్ల రాజేశం, చంద్రగిరి గంగయ్య, కాంతయ్య, మహేష్, మహేందర్, రమేష్, ఆనంద్, కమలాకర్, జలపతి, సురేష్, వంశీ, అతీష్ తదితరులు పాల్గొన్నారు.

## అన్నార్థుల ఆకలి తీర్చే లక్ష్యం దిశగా

# అన్నపూర్ణ స్వచ్ఛంద సేవా సంస్థ

- దాతల సహకారంతో గత 736వ రోజులుగా అన్నదాన సేవలు
- అన్నపూర్ణ స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకులు : తోట లహరి



వేములవాడ (ప్రశ్న న్యూస్) ప్రసిద్ధ పుణ్యక్షేత్రం దక్షిణ కాశీగా పేరుగాంచిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ ఆవరణలో అన్నపూర్ణ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం 736వ రోజు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. శివుడికి ప్రీతికరమైన సోమవారం సందర్భంగా కట్ట దేవదాస్-జమున దంపతులు, వారి కుటుంబ సభ్యులు అందించిన విరాళంతో పాటు శాశ్వత దాతలు నాగుబోతు రవీందర్-జ్యోతి దంపతులు (భాను ఏజెన్సీస్), వార్షిక దాతలు తోట లక్ష్మి, కూరగాయల మధు-మమత దంపతుల సహకారంతో ఆలయ ఆవరణలోని నిరుపేదలు, యాచకులు, పట్టణ పరిసర ప్రాంతాల అన్నార్థులకు భోజన ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అన్నపూర్ణ స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకులు తోట లహరి మాట్లాడుతూ, సమాజంలో ఆకలితో అలమటించే వారికి అన్నదానం చేయడమే తమ లక్ష్యమని, అన్నదాన సేవలు గొప్ప సేవ అని, తమ సంస్థ గత 736 రోజులుగా నిరంతరంగా ఈ సేవా కార్యక్రమాన్ని కొనసాగిస్తోందన్నారు. ఈ సేవా కార్యక్రమాల నిర్వహణకు దాతల సహకారం ఎంతో అవసరమని, సహాయం అందించాలనుకునే వారు ట్రస్ట్ నంబర్ 8919376459ను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు తోట లహరి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## రైతు సంక్షేమంలో

# సహకార సంఘాల పాత్ర కీలకం

- కోరెం ప్యాక్స్ చైర్మన్ : తీపిరెడ్డి కిషన్ రెడ్డి
- కోరెం ప్యాక్స్‌లో ఘనంగా అఖిల భారత సహకార వారోత్సవాలు



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలోని కోరెం ప్యాక్స్‌లో అఖిల భారత సహకార వారోత్సవాల సందర్భంగా సోమవారం జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్యాక్స్ చైర్మన్ తీపిరెడ్డి కిషన్ రెడ్డి మాట్లాడుతూ, సహకార సంఘాలు రైతులకు ఆర్థికంగా బలాన్నిచ్చే ముఖ్యమైన వ్యవస్థలని అన్నారు. రైతులకు ఎరువులు, రుణాలు, ఇతర సేవలను పారదర్శకంగా అందిస్తూ గ్రామీణాభివృద్ధిలో సహకార సంఘాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. సహకార స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ పెంపొందించి, రైతుల సంక్షేమానికి అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్యాక్స్ డైరెక్టర్లు మొగిలిపాలెం నర్సయ్య, ఉమ్మెంతుల లక్ష్మారెడ్డి, డబ్బు బాపురెడ్డి, మంద వెంకటేష్, చంద్రరావు, ప్యాక్స్ సిబ్బంది ఆర్. అనిల్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్ భూ పోరాటానికి

# ఉద్యమకారులంతా తరలిరావాలి

- ఉద్యమకారుల ఇంటి స్థలాల సాధనకు జూలై 2 భూ పోరాటాన్ని విజయవంతం చేయాలి
- టీఆర్ఎస్ పార్టీ జిల్లా బాధ్యులు: మజీద్
- తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ రాష్ట్ర చైర్మన్ : భోగి పద్మ





సిరిసిల్ల (ప్రశ్న న్యూస్) తెలంగాణ ఉద్యమకారులకు ప్రభుత్వం హామీ ఇచ్చిన ఇంటి స్థలాలను వెంటనే కేటాయించాలని డిమాండ్ చేస్తూ జూలై 2న హైదరాబాద్‌లోని ఉప్పల్ భగాయత్ ప్రాంతంలో నిర్వహించనున్న భూ పోరాటాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ రక్షణ సేన జిల్లా ఇంచార్జి మజీద్, తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ రాష్ట్ర చైర్మన్ భోగి పద్మ పిలుపునిచ్చారు. సోమవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు భూ పోరాటానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడిన వారు, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సుమారు 1,200 మంది అమరులయ్యారని, వేలాది మంది ఉద్యమకారులు జైలు జీవితం గడిపి శారీరకంగా, మానసికంగా,ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత కూడా ఉద్యమకారుల కుటుంబాలకు ఆశించిన స్థాయిలో న్యాయం జరగలేదని,గత బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమయ్యాయని విమర్శించారు. ముఖ్యంగా ప్రతి ఉద్యమకారునికి 250 గజాల ఇంటి స్థలం,పెన్షన్, ఇంటికో ఉద్యోగం కల్పిస్తామని చెప్పినా, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు గడిచినా ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని ఆరోపించారు. ఉద్యమకారుల హక్కుగా ఉన్న ఇంటి స్థలాల కోసం చేపట్టిన ఈ భూ పోరాటంలో పార్టీలకు అతీతంగా తెలంగాణ ఉద్యమకారులు, అమరవీరుల కుటుంబ సభ్యులు,మద్దతుదారులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో తెలంగాణ రక్షణ సేన నాయకులు కదిరే భాస్కర్ గౌడ్,జావీద్,రేణుక,లాస్య, అక్కపల్లి భూపతి, లాల్ మహమ్మద్,సాలెంద్రీ నవీన్,కోడి ముంజ బాబు, బైరి రాజేష్,బండి శ్రీహరి, మోహన్ రెడ్డి,అనూష, లహరి,అజీజ్,తోట కనుకయ్య,చామనపల్లి చంద్రశేఖర్,అవదుర్తి శ్రవణ్, సయ్యద్ రజక్,దేవా, అనసూర్య,అంతగిరి సంపత్, దుస్స రవీందర్ తదితర ఉద్యమకారులు పాల్గొన్నారు.

## బోయినిపల్లిలో అసిస్టెంట్ కుక్

# పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

- జూలై 3 వరకు దరఖాస్తుల స్వీకరణ
- మండల విద్యాధికారి : శ్రవణ్ కుమార్



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా విద్యాధికారి ఆదేశాల మేరకు బోయినిపల్లి మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ), ఆదర్శ పాఠశాలలో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ కుక్ (మల్టీపర్పస్ వర్కర్) పోస్టుల భర్తీకి అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాధికారి శ్రవణ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆదర్శ పాఠశాలలో ఒక పోస్టు, కేజీబీవీలో ఒక పోస్టు చొప్పున మొత్తం రెండు ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. ఆసక్తి గల స్థానిక మహిళా అభ్యర్థులు ఈ నెల 30 నుంచి జూలై 3వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు మండల విద్యాధికారి కార్యాలయం, బోయినిపల్లిలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. దరఖాస్తుతో పాటు 7వ తరగతి మెమో, కుల ధృవీకరణ పత్రం, ఆధార్ కార్డు, స్థానిక అభ్యర్థి ధృవీకరణ పత్రాల జిరాక్స్ కాపీలను జతచేయాలని తెలిపారు. ఈ నియామకాలకు స్థానిక మహిళా అభ్యర్థులు మాత్రమే అర్హులని మండల విద్యాధికారి స్పష్టం చేశారు.

# డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణమే లక్ష్యం

- అవగాహన కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు



జగిత్యాల (ప్రశ్న న్యూస్) అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం,అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని జగిత్యాల జిల్లా కేంద్రంలోని సుమంగళి గార్డెన్స్‌లో డ్రగ్స్ నిర్మూలనపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్, కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్, జిల్లా ఎస్పీ అశోక్, జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ హాజరై యువతకు మాదకద్రవ్యాల వల్ల కలిగే ప్రమాదాలపై అవగాహన కల్పించారు. డ్రగ్స్ వ్యసనం వ్యక్తిగత జీవితానికే కాకుండా కుటుంబం, సమాజంపై కూడా తీవ్ర ప్రభావం చూపుతుందని వారు పేర్కొన్నారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి విద్య, ఉపాధి, క్రీడలు వంటి సానుకూల మార్గాల్లో ముందుకు సాగాలని సూచించారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా ప్రభుత్వం విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపడుతోందని పేర్కొంటూ, మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలని అధికారులు, ప్రజాప్రతినిధులు పిలుపునిచ్చారు.

## నకిలీ ధ్రువీకరణ పత్రాలతో

# భూమి రిజిస్ట్రేషన్.. ఐదుగురి అరెస్ట్

- వేములవాడ రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ : శ్రీనివాస్



వేములవాడ (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడ రూరల్ మండలం, నూకలమర్రి గ్రామంలో గ్రామపంచాయతీ కార్యదర్శి పేరిట నకిలీ ధ్రువీకరణ పత్రాలు సృష్టించి భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించిన కేసులో ఐదుగురిని రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. మాజీ పంచాయతీ కార్యదర్శి రమ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు, తాళ్లపల్లి సాగర్, తాళ్లపల్లి లత, తాళ్లపల్లి చంద్రవ్వ, గుడిసె విష్ణువర్ధన్, మంద అభినయ్‌లను వేములవాడలో అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. నిందితుల నుంచి మొబైల్ ఫోన్లు, రిజిస్ట్రేషన్ పత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు వేములవాడ రూరల్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. కేసు దర్యాప్తులో సహకరించిన ఎస్ఐ వెంకట్రాజం, సిబ్బందిని సీఐ అభినందించారు.

# రాజన్న సిరిసిల్ల జిల్లాలో వరుణుడి పలకరింపు..

- చెరువులకు జలకళ, రైతులకు ఊరట
- చందుర్తిలో అత్యధిక వర్షపాతం.. జిల్లా వ్యాప్తంగా జల్లులు




సిరిసిల్ల (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఆదివారం సాయంత్రం నుంచి రాత్రి వరకు కురిసిన వర్షాలు రైతులకు ఊరటనిచ్చాయి. జిల్లాలో సగటున 28.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదుకాగా, సాధారణంతో పోలిస్తే ఇది 536 శాతం అధికమని అధికారులు తెలిపారు. జిల్లాలో అత్యధికంగా చందుర్తి మండలంలో 60.6 మిల్లీమీటర్లు, కోనరావుపేటలో 49.4 మిల్లీమీటర్లు, వీర్నపల్లిలో 42.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. వర్షాలతో చెరువులు, కుంటల్లోకి నీరు చేరి ఖరీఫ్ సాగుకు అనుకూల పరిస్థితులు ఏర్పడ్డాయి. అయితే జూన్ 1 నుంచి 29 వరకు జిల్లాలో మొత్తం వర్షపాతం 88.5 మిల్లీమీటర్లే నమోదుకాగా, సాధారణ వర్షపాతం 120.9 మిల్లీమీటర్లతో పోలిస్తే 27 శాతం లోటు కొనసాగుతోంది. మరిన్ని వర్షాలు కురిస్తే సాగు పనులు వేగం పుంజుకుంటాయని రైతులు, వ్యవసాయ శాఖ అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను

# సత్వరమే పరిష్కరించాలి

జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి



మేడ్చల్ (ప్రశ్న న్యూస్ )ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు అందజేస్తూ జాప్యం లేకుండా సత్వరమే అర్జీలను పరిశీలించి పరిష్కరించాలని మేడ్చల్ మల్కాజిగిరి అదనపు జిల్లా కలెక్టర్ విజయేందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారులను డిఆర్ఓ చంద్రావతి తో కలిసి అదనపు కలెక్టరు (95) దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టరు మాట్లాడుతూ ఎంతో వ్యయ, ప్రయాసలకోర్చుకొని వారి సమస్యలను పరిష్కరిస్తామనే నమ్మకంతో ప్రజలు మన వద్దకు వస్తారని, వారి నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత మనందరి పైన ఉన్నదని అదనపు కలెక్టర్ తెలిపారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని దరఖాస్తుల పరిశీలనలో ఏలాంటి జాప్యం లేకుండా చూడాలని అదనపు కలెక్టరు అన్నారు. అదేవిధంగా తిరస్కరించే దరఖాస్తుల గురించి తిరస్కరణకు గల కారణాలను తప్పనిసరిగా వివరంగా అర్జీదారులకు తెలియజేయాలని అధికారులకు సూచించారు. స్వీకరించిన దరఖాస్తులపై తీసుకున్న చర్యల వివరాలను ఆన్ లైన్ లో వెంట వెంట నమోదు చేయాలని సంబంధిత అధికారులకు అదనపు కలెక్టరు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ లిస్టు సవరణ కార్యక్రమాన్ని పరిశీలించిన మార్కెట్ కమిటీ చైర్మన్



మేడ్చల్ (ప్రశ్న న్యూస్ ) గుండ్ల పోచంపల్లి డివిజన్ లో ఓటర్ లిస్టు సవరణ కార్యక్రమం మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహా యాదవ్ పరిశీలించారు. ఈ సందర్భంగ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సాయిపేట శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారమ్‌ల పంపిణీని పరిశీలించి, అధికారులతో మాట్లాడారు. అనంతరం నర్సింహా యాదవ్ మాట్లాడుతూ, అర్హులైన ప్రతి ఓటరు తప్పనిసరిగా ఎన్యూమరేషన్ ఫారమ్‌ను పూర్తి చేసి సంబంధిత బీఎల్ఓకు సమర్పించాలని సూచించారు. ఫారమ్‌ను సక్రమంగా సమర్పించిన వారి పేర్లు మాత్రమే తుది ఓటరు జాబితాలో కొనసాగుతాయని పేర్కొంటూ, ప్రతి ఒక్కరూ ఈ ప్రక్రియను బాధ్యతగా పూర్తి చేయాలని కోరారు. అలాగే కాంగ్రెస్ పార్టీ బూత్ లెవెల్ ఏజెంట్లు ప్రతి ఇంటిని సందర్శించి అర్హులైన ఓటర్లందరికీ ఎన్యూమరేషన్ ఫారమ్‌లు అందేలా చూడాలని, ఏ ఒక్క అర్హుడి ఓటు కూడా తొలగించబడకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గుండ్లపోచంపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సాయిపేట శ్రీనివాస్, మాజీ సర్పంచ్ బండారి నరేందర్, ఎస్సీ సెల్ అధ్యక్షులు కుండా భాను చందర్, కావలి భాస్కర్, బండారి వెంకట్, షబ్బీర్, కేసరి భానుచందర్,బాలకృష్ణ, బి ఎల్ ఓ లు శశిధర్ రెడ్డి, విజయ్, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్ ఖిల్లాపై కాషాయ జెండా ఎగరాలి

## - బీఆర్ఎస్, కాంగ్రెస్లు అవినీతిని ప్రోత్సహిస్తున్నాయన్న నితిన్ నబీన్





హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) 12 ఏళ్ల పాలనలో 25 కోట్ల మందిని పేదరికం నుంచి బయటపడేసిన ఘనత మోదీ సర్కార్కే దక్కుతుందని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ అన్నారు. వరంగల్ బల్దియా సహా వచ్చే సార్వత్రిక ఎన్నికల్లోనూ తెలంగాణలో కాషాయ జెండా ఎగరాలని ఆకాంక్షించారు. వరంగల్ నగర సమగ్రాభివృద్ధికి రూ.వేల కోట్లు ఇచ్చిన ఘనత మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వానిదేనని కేంద్ర మంత్రులు కిషన్రెడ్డి, బండి సంజయ్లు స్పష్టం చేశారు.

### - 12 ఏళ్లలో తెలంగాణకు రూ.వేల కోట్ల నిధులు

బీఆర్ఎస్, కాంగ్రెస్ హయాంలో కుటుంబ పాలన, అవినీతి తప్ప తెలంగాణ అభివృద్ధిని విస్మరించారని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ విమర్శించారు. హనుమకొండ ఆర్ట్స్ కళాశాల మైదానంలో బీజేపీ బూత్ అధ్యక్షుల సమ్మేళనం కార్యక్రమానికి కేంద్రమంత్రులు కిషన్రెడ్డి, బండి సంజయ్, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్రావుతో కలిసి హాజరయ్యారు. తెలంగాణ అభివృద్ధికి పుష్కరకాలంగా మోదీ సర్కార్ రూ.వేల కోట్ల నిధులు ఇచ్చిందని గుర్తుచేశారు.

విభజన రాజకీయాలు చేస్తున్నవారికి వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని కోరారు. తెలంగాణలోనూ కమలం జెండా ఎగరాలని ఆకాంక్షిస్తున్నట్లు చెప్పారు. క్షేత్రస్థాయిలోకి వెళ్లాలని నేతలు, శ్రేణులకు నితిన్ నబీన్ సూచించారు. మహిళలు, యువత, రైతులతో మమేకమై కేంద్రం అమలుచేస్తున్న పథకాలు, వాటి లబ్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని దిశానిర్దేశం చేశారు. కాజీపేటలో రైల్వే వ్యాగన్ ఫ్యాక్టరీ పెట్టాలన్న పీవీ నరసింహారావు కలను సాకారం చేసిన ప్రధాని మోదీకి వరంగల్ ప్రజల తరఫున ధన్యవాదాలు చెబుతున్నానని నితిన్ నబీన్ తెలిపారు. ఈ ఫ్యాక్టరీతో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు అపారంగా లభిస్తాయన్నారు.

సార్వత్రిక ఎన్నికలకు సెమీఫైనల్గా భావించే వరంగల్ కార్పొరేషన్ పోరులో బీజేపికి పట్టం కట్టాలని కోరుతున్నట్లు చెప్పారు.

### - వరంగల్ అభివృద్ధి కోసం రూ.17 వేల కోట్లు

రాష్ట్రాన్ని బీఆర్ఎస్, కాంగ్రెస్ దోచుకున్నాయని, అభివృద్ధి కావాలంటే డబుల్ ఇంజిన్ సర్కార్ రావాల్సిందేనని కేంద్రమంత్రులు కిషన్రెడ్డి, బండిసంజయ్ స్పష్టం చేశారు. ప్రభుత్వ పథకాల్లో అవినీతి జరగకుండా మోదీ సర్కార్ చర్యలు తీసుకుందని, ఈ విషయాన్ని క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించాలని సూచించారు. పుష్కర కాలంలో వరంగల్ సమగ్రాభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం రూ.17 వేల కోట్లు మంజూరు చేసిందని గణాంకాలతో సహా వివరించారు.

### - జనవరి నాటికి యూనిట్ ప్రారంభం

వచ్చే జనవరి నాటికి రైల్ మాన్ఫ్యాక్చరింగ్ యూనిట్ ప్రారంభమవుతుందని కిషన్రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎన్నికలు ఎపుడొచ్చినా కాషాయ జెండా ఎగరటం ఖాయమని కేంద్రమంత్రులు ధీమా వ్యక్తం చేశారు.

అంతకు ముందు హనుమకొండ హరిత కాకతీయ హోటల్లో గిరిజన సంఘాల నాయకులు, మేధావులతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ పాల్గొన్నారు. గిరిజన ప్రాంతాల్లో శాంతి, అభివృద్ధే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.

# గాదె సాయికృష్ణ కేసులో కీలక పరిణామం

## - సిట్ అదుపులో ఇద్దరు కానిస్టేబుల్స్



అమరావతి (ప్రశ్న న్యూస్) గాదె సాయికృష్ణ లాకప్ డెత్ కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. వారం రోజులుగా అజ్ఞాతంలో ఉన్న కానిస్టేబుల్స్ అశోక్, నాని లు సూర్యారావు పేటలోని ఏసీపీ ఆఫీసులో లొంగిపోయారు. వీళ్లిద్దరు సీఐ నాగరాజుకు సహకరించినట్టు ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికే నాగరాజుతోపాటు కానిస్టేబుల్ బాబురావును అరెస్టు చేశారు. వీళ్ల అరెస్టుతో సాయికృష్ణ మృతదేహాన్ని ఏం చేశారనే విషయాలపై క్లారిటీ రానుంది. గాదె సాయికృష్ణ లాకప్డెత్ కేసులో మొదట సస్పెండెడ్ సీఐ నాగరాజు అరెస్టు తర్వాత కానిస్టేబుల్ నాని, అశోక్ అరెస్టు ఖాయమని తేలిపోయింది. అసలు సాయికృష్ణకు సంబంధించిన సమాచారంపై నాగరాజు నోరు విప్పలేదు. దీంతో అసలు సాయికృష్ణ మృతదేహాన్ని ఎలా మాయం చేశారు. అసలు అతని మృతి కారణాలు ఏంటీ, అతని అరెస్టు తర్వాత ఏం జరిగిందనే విషయాలపై క్లారిటీ రాలేదు. దీంతో కేసు ముందుకు కదల్లేదు. అందుకే నాగరాజుకు కళ్లు, చెవులుగా ఉన్న స్నేహితుడు సురేష్, కానిస్టేబుల్స్ అశోక్, నానిని విచారిస్తే కేసులో పురోగతి ఉంటుందని సిట్ అధికారులు ప్రయత్నించారు. అయితే నాగరాజు అరెస్టు అయిన క్షణం నుంచి వీళ్ల ముగ్గురు అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. పరారీలో ఉన్న వీళ్ల ముగ్గురి కోసం సిట్ అధికారులు అన్ని విధాలుగా ప్రయత్నాలు చేశారు. అయితే చివరకు కుటుంబ సభ్యులతో మాట్లాడి వారిని ఒప్పించి లొంగిపోయేలా సఫలీకృతమయ్యారు. సాయికృష్ణను లాకప్డేత్ చేశారని ఈకేసులో తప్పించుకునే ఛాన్స్ లేదని, విచారణకు సహకరిస్తే మంచిదని కుటుంబాలను ఒప్పించి నోటీసులు ఇచ్చారు. దీంతో రెండు రోజులు క్రితం నాగరాజు స్నేహితుడు సురేష్ సిట్ అధికారులకు లొంగిపోతే, రెండు రోజుల తర్వాత సోమవారం కానిస్టేబుల్స్ నాని, అశోక్ ఇద్దరూ ఏసీపీ మానస ఎదుట లొంగిపోయారు. వెంటనే వారిని సిట్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. విచారణ పూర్తి అయిన తర్వాత వారిని కోర్టులో హాజరుపరిచే ఛాన్స్ ఉంది. ఈ సాయికృష్ణ కేసులో మరో కానిస్టేబుల్ను కూడా సిట్ అధికారులు అరెస్టు చేశారు. ఇద్దరు కానిస్టేబుల్స్ లొంగిపోక ముందే కానిస్టేబుల్ బాబురావును అదుపులోకి తీసుకున్నారు. ఆయన్ని విచారిస్తున్న క్రమంలోనే అశోక్, నాని లొంగుబాటు జరిగింది. వీళ్ల అరెస్టుతో కేసులో పురోగతి కనిపిస్తుందని అధికారులు భావిస్తున్నారు. ఈ కేసులో వీరి అరెస్టుతో మొత్తం అరెస్టుల సంఖ్య ఐదుకు చేరింది.

# అమరావతి నిర్మాణంలో భాగమైనందుకు గర్వపడాలి

## - నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టు సంస్థలకు ఆదేశం

అమరావతి (ప్రశ్న న్యూస్) దేశం గర్వించే రాజధాని అమరావతి నిర్మాణంలో భాగమైనందుకు ప్రతి ఒక్కరూ గర్వపడాలని, ఇది కేవలం కట్టడాల నిర్మాణం కాదని, ఓ చరిత్ర నిర్మాణమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టులో పాలుపంచుకుంటున్న కాంట్రాక్టు సంస్థలు, తాము ఒక బ్రాండ్ను సంపాదిస్తున్నామన్న భావనతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. రాజధాని నిర్మాణ పనుల పురోగతిపై సచివాలయంలో ఎల్ అండ్ టీ, షాపూర్ జీ పల్లోంజి, మెగా ఇంజినీరింగ్, ఎన్సీసీ వంటి ప్రముఖ నిర్మాణ సంస్థల ప్రతినిధులతో సోమవారం ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, "హైదరాబాద్ ప్లస్గా అమరావతిని నిర్మిస్తున్నాం. ఇది యావత్ దేశానికి గర్వకారణంగా నిలవాలి. అత్యుత్తమ నివాసయోగ్య నగరంగా రూపుదిద్దుకుంటున్న అమరావతిలో మేం భాగస్వాములం అయ్యామన్న ఆలోచనతో కాంట్రాక్టర్లు పనిచేయాలి" అని సూచించారు. నిర్మాణ పనులను మరింత వేగవంతం చేసి, నిర్దేశిత గడువు కంటే ముందే పూర్తి చేయాలని ఆదేశించారు. నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడొద్దని, అసెంబ్లీ, హైకోర్టు, సచివాలయ టవర్లు రాష్ట్రానికి ఐకానిక్ నిర్మాణాలుగా నిలిచిపోవాలని ఆకాంక్షించారు. ప్రస్తుతం రాజధాని పరిధిలో రూ.50,999 కోట్ల విలువైన పనులు వివిధ దశల్లో ఉన్నాయని అధికారులు సీఎంకు వివరించారు.

హౌసింగ్, ట్రంక్ ఇన్ఫ్రా, ఎల్పీఎస్ ఇన్ఫ్రాతో పాటు కీలకమైన ప్రభుత్వ భవనాల నిర్మాణం వేగంగా జరుగుతోందని తెలిపారు. పనుల వేగవంతానికి అవసరమైన యంత్రాలు, మానవ వనరులను ముందుగానే సిద్ధం చేసుకోవాలని సీఎం స్పష్టం చేశారు. ప్రస్తుతం 26,924 మంది కార్మికులు, 5,140కి పైగా భారీ యంత్రాలు పనుల్లో నిమగ్నమై ఉన్నాయని పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ ముఖ్యమంత్రికి వివరించారు. భవిష్యత్తులో వరద ముంపు సమస్యలు తలెత్తకుండా కొండవీటి వాగు, పాలవాగులను వెడల్పు చేస్తున్నామని తెలిపారు. గత పాలకులు ఐదేళ్ల పాటు రాజధాని నిర్మాణాన్ని పూర్తిగా నిలిపివేశారని, రెండేళ్లుగా తాము మళ్లీ పనులను గాడిలో పెట్టామని చంద్రబాబు గుర్తుచేశారు. దేశంలోని పవిత్ర క్షేత్రాల నుంచి మట్టి, నీరు తెచ్చి పునీతం చేసిన ఈ ప్రాంతంలో నిర్మాణాలను అడ్డుకోవడానికి కొందరు ప్రయత్నిస్తున్నారని, అయినా రాష్ట్ర ప్రజల ప్రయోజనాలే ముఖ్యమని స్పష్టం చేశారు. నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించేందుకు ప్రతి రెండు నెలలకు ఒకసారి సమావేశం అవుతానని తెలిపారు. నిర్మాణాలు పూర్తయ్యాక, ప్రారంభోత్సవానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఆహ్వానిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. ఈ



సమీక్షలో సీఆర్డీఏ అధికారులు, వివిధ కాంట్రాక్టు సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ లో పెరిగిన విషసర్పాల బెడద!

## - పట్టుబడిన వాటిలో నాగుపాములు, జెర్రిపోతులే అధికం



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్ నగరవాసులను పాముల బెడద వణికిస్తోంది. ఈ జూన్ నెలలో పాముల సంచారం అనూహ్యంగా పెరగడంతో రెస్క్యూ బృందాలకు ఫోన్ కాల్స్ వెల్లువెత్తాయి. నగరానికి చెందిన 'ఫ్రెండ్స్ ఆఫ్ స్నేక్స్' అనే స్వచ్ఛంద సంస్థ, జూన్ 1 నుంచి 25వ తేదీ మధ్యలోనే సుమారు 1,300 పాములను రక్షించింది. గతేడాది జూన్ నెల మొత్తం మీద పట్టుకున్న పాముల సంఖ్య (సుమారు 1,200) కంటే ఇది అధికం కావడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. ఈ పరిణామానికి ప్రధాన కారణం నైరుతి రుతుపవనాల బలహీనమైన ఆరంభమేనని నిపుణులు చెబుతున్నారు. అడపాదడపా కురుస్తున్న వర్షాలు, వాతావరణంలోని తేమ పాముల సంచారానికి అనుకూలంగా మారాయి. సాధారణంగా భారీ వర్షాలు కురిస్తే ఉష్ణోగ్రతలు తగ్గి పాములు బయటకు రావడం తగ్గుతుంది. కానీ, ఈసారి అలా జరగకపోవడంతో అవి ఎక్కువగా కనిపిస్తున్నాయి. అంతేకాకుండా, జూన్ నెల పాము పిల్లలు గుడ్ల నుంచి బయటకు వచ్చే సమయం కావడం కూడా ఇందుకు దోహదం చేస్తోంది. పట్టుబడిన పాముల్లో 500కు పైగా నాగుపాములు (తాచుపాములు), సుమారు 300 జెర్రిపోతులు ఉన్నట్లు 'ఫ్రెండ్స్ ఆఫ్ స్నేక్స్' సంస్థ తెలిపింది. వాతావరణ మార్పులతో పాటు, అటవీ ప్రాంతాలను ఆనుకుని నిర్మాణాలు పెరగడం (పట్టణీకరణ) వల్ల కూడా పాములు జనావాసాల్లోకి వస్తున్నాయి. అయితే, ప్రజల్లో అవగాహన పెరగడంతో పాములను చంపకుండా రెస్క్యూ బృందాలకు సమాచారం ఇవ్వడం కూడా కాల్స్ సంఖ్య పెరగడానికి ఒక కారణంగా నిలుస్తోంది. ఇలా రక్షించిన పాములను అటవీ శాఖ అధికారుల సహకారంతో వాటి సహజ ఆవాసాలైన అటవీ ప్రాంతాల్లో సురక్షితంగా వదిలిపెడుతున్నారు. జూలైలో వర్షాలు ఊపందుకుని, ఎడతెరిపి లేకుండా కురిస్తే పాముల సంచారం తగ్గే అవకాశం ఉందని రెస్క్యూ బృందాలు అంచనా వేస్తున్నాయి.

# తెలంగాణలో భారీగా డీఎస్పీల బదిలీలు

## - ఒకేసారి 36 మంది ట్రాన్స్ఫర్



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ పోలీస్ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా 36 మంది డీఎస్పీలు ఒకేసారి బదిలీ అయ్యారు. ఈ మేరకు తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. పోలీస్ ఎస్టాబ్లిష్ మెంట్ బోర్డ్(పీఈబీ) చేసిన సిఫార్సుల మేరకు ఈ బదిలీల ప్రక్రియ జరిగినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఖాళీగా ఉన్న స్థానాలో పోస్టింగ్ లు కల్పించేందుకు ఈ ఉత్తర్వులను తక్షణమే అమలు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఇక బదిలీ అయిన అధికారులను సీఐడీ, ఏసీబీ, ఇంటెలిజెన్స్, స్పెషల్ బ్రాంచ్, వివిధ జిల్లాల ఏసీపీ పోస్టులు తదితర కీలక విభాగాల్లో నియమించారు. పీ. శ్రీశైలం ఏసీపీ సీసీఎస్ నిజామాబాద్, సంకెళ్ల వెంకటేశ్ డీఎస్పీ, సీఐడీ, కంపా రవీందర్ ఏసీపీ, సీసీఎస్ రామగుండం, సీ విజయరాజు డీఎస్పీ, పీసీఎస్, జీ. వెంకటేశ్వర్లు డీఎస్పీ, ఎస్బీ, సిరిసిల్ల, బొబ్బల ప్రవీణ్ డీఎస్పీ, ఇంటెలిజెన్స్, బూర శ్రీనివాస్ డీఎస్పీ రోడ్ సేఫ్టీ, ఎం. వెంకట నర్సయ్య డీఎస్పీ, జీ మహేందర్ రెడ్డి డీజీ, ఏసీబీ, గొర్ల సీతారెడ్డి డీజీ, వీ అండ్ ఈ, బీ బాలాజీ ఏసీపీ, అడపా నరసింహారావు ఏసీపీ, సీసీఆర్బీ ఖమ్మం. ఎం. వెంకట రామయ్య డీఎస్పీ, రాజీవ్ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్, పబ్బతి వెంకటేశ్వర్లు డీఎస్పీ, సీఐడీ, కీత రామకృష్ణ ఏసీపీ, సీఎస్డబ్ల్యూ హైదరాబాద్, కోస్గి భాస్కర్ డీఎస్పీ, డీసీఆర్బీ, కరుణాకర్ ఏసీపీ, హైదరాబాద్, ఎం. వెంకట్ రెడ్డి డీఎస్పీ, పార రాజు డీఎస్పీ, నూనె వెంకటేశ్వర్లు డీజీ, జీ గోవర్ధనగిరి ఏసీపీ, ఎస్. వెంకటేశ్ ఏసీపీ, గురునాయుడు ఏసీపీ, భూపతి గట్టుమల్లు డీఎస్పీ, హరినాథ్ బాబు ఏసీపీ, రాజా రెడ్డి డీఎస్పీ, నరేందర్ ఏసీపీ, రాజయ్య డీఎస్పీ తదితరులు ఉన్నారు.

# వీబీజీ రామ్జీ చట్టాన్ని ఉపసంహరించాలి

## - కేంద్రానికి అభ్యంతరాలను తెలియజేసిన సీతక్క



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) వీబీ జీ రామ్ జీ పథకం 60:40 నిధుల విధానంపై తెలంగాణకు తీవ్ర అభ్యంతరాలు ఉన్నాయని మంత్రి సీతక్క కేంద్రానికి తెలియజేశారు. ఈరోజు ఢిల్లీలో జరిగిన జాతీయ గ్రామీణాభివృద్ధి సదస్సులో పాల్గొన్న ఆమె తెలంగాణలో అమలు చేస్తున్న గ్రామీణాభివృద్ధి పథకాల వివరాలను కేంద్రానికి వివరించారు. జులై 2న వీబీ జీ రామ్ జీ పథకం కొనసాగించాలా? లేక కొత్త పథకం తీసుకురావాలా? అనే అంశంపై తెలంగాణ కేబినెట్ తుది నిర్ణయం తీసుకుంటుందని సీతక్క ప్రకటించారు. కొత్త పథకం ప్రవేశపెడితే 100 శాతం ఆర్థిక భారం రాష్ట్రంపైనే పడుతుందని, ఇది సమస్యాత్మకమని కేంద్రానికి తెలియజేశారు. ఎంజీఎన్ఆర్ఈజీఎస్లో 100 శాతం వేతనాల విధానం కొనసాగించాలని, మెటీరియల్ కాంపోనెంట్కు 75 శాతం కేంద్ర వాటా ఉండాలని విజ్ఞప్తి చేశారు. పీఎం ఆవాస్ యోజన కింద గత బీఆర్ఎస్ ప్రభుత్వం వద్దనడంతో కేటాయింపులు లేవని ఆ పథకం కింద తక్షణమే గృహాలు మంజూరు చేయాలని సీతక్క కోరారు. పీఎంజీఎస్వై రోడ్లకు అటవీ అనుమతులు ప్రధాన అడ్డంకిగా ఉన్నాయని, కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్కు వినతిపత్రం అందజేశామని తెలిపారు. తెలంగాణలో జల్ సంచార్ విభాగంలో 13 జాతీయ అవార్డులు సాధించడం కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని సీతక్క పేర్కొన్నారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588